మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 26 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada





## సిజెఐతో సిఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తాజ్‌ఫలక్ నుమాలో సీజేఐతో భేటీ అయ్యారు. మిగతా 2లో..

# ఫోన్ ట్యాపింగ్‌పై బిగుసుకుంటున్న ఉచ్చు



- వ్యవహారంలో మరో ఇద్దరు అరెస్ట్
- రాధాకిషన్, గట్టు మల్లులను విచారిస్తున్న పోలీసులు
- భుజంగరావు, తిరుపతన్నకు 5 రోజుల పోలీసు కస్టడీ
- ప్రణీత్‌రావునూ మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోరిన అధికారులు
- పిటీషన్ కొట్టేసిన కోర్టు
- కేసులో దర్యాప్తు ముమ్మరం
- త్వరలో డీజీపీ, అదనపు డీజీపీ స్థాయి అధికారులకూ నోటీసులు

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను 5 రోజుల పోలీసుల కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును సైతం మరోసారి 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా..ఆ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ప్రస్తుతం ముగ్గురు నిందితులు చంచల్‌గూడ జైల్లో ఉన్నారు. ఈ కేసులో తాజాగా మరో ఇద్దరిని



పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, గట్టు మల్లును అదుపులోకి తీసుకుని బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో విచారిస్తున్నారు. గట్టు మల్లు గతంలో ఎస్ఐబీలో సీఐగా పని చేశారు. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుతో వీరికి ఉన్న సంబంధాలపై దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. ఫోన్ ట్యాపింగ్‌లో మరో ఇద్దరు అరెస్ట్ తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ సంచలన మిగతా 2లో..

## ముగిసిన మహబుబ్ నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్

### ఓటేసిన సిఎం రేవంత్..ఎమ్మెల్యే బండ్ల

### 99.86 శాతం ఓటింగ్ నమోదు -2న కౌంటిగ్..అదేరోజు ఫలితం వెల్లడి



మహబుబ్ నగర్,మార్చి28 (ప్రజా మంటలు): మహబుబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకూ జరిగింది. . ఈ ఎన్నికల్లో 99.86 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం1439 మందికి గానూ 1437 మంది స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాగర్‌కర్నూలు, నారాయణపేట కేంద్రాల్లో ఇద్దరు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోలేదు. మొత్తం 10 పోలింగ్ కేంద్రాలకు గానూ 8 కేంద్రాల్లో 100 శాతం ఓటింగ్ నమోదైంది.కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ అఫిషియో ఓటు వినియోగించుకున్నారు. మిగతా 2లో..

## జైలు నుంచి కేజ్రీవాల్ పాలనను అడ్డుకోలేం

- సీఎంగా కొనసాగడానికి అడ్డంకి ఏంటీ?'
- దిల్లీ హైకోర్టు తీర్పు



న్యూఢిల్లీ, మార్చి 28 (ప్రజా మంటలు): ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు న్యాయస్థానంలో ఊరట లభించింది. జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడాన్ని అడ్డుకోలేమని దిల్లీ హైకోర్టు చెప్పింది. అందుకు న్యాయపరంగా ఉన్న అడ్డంకులు ఏంటని ప్రశ్నించింది. ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రిగా తొలగించాలని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మద్యం కేసులో కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసినందున ఆయన్ను సీఎం పదవి నుంచి తొలగించాలని మిగతా 2లో..

## న్యాయవ్యవస్థను సమగ్రతను దెబ్బతీసేందుకు కుట్రలు

- రాజకీయ ఒత్తిళ్లతో ముప్పు పొంచి ఉంది
- ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలు
- సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి 600 మంది న్యాయవాదుల లేఖ



2లో..

## 6న తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ

- జాతీయస్థాయిలో ఐదు గ్యారెంటీలు
- ప్రకటించున్న అగ్రనేత రాహుల్ గాంధీ
- కొడంగల్‌కు పరిశ్రమలు తెస్తా
- అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- నియోజకవర్గాన్ని కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్



కొడంగల్ మార్చి28 (ప్రజా మంటలు): వచ్చే నెల 6న తుక్కుగూడలో కాంగ్రెస్ సభ ఉంటుందని, ఆ సభలో రాహుల్ గాంధీ 5 గ్యారెంటీలను ప్రకటిస్తారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో తుక్కుగూడలో కాంగ్రెస్ జాతీయస్థాయి సభ - అక్కడి నుంచే దేశ రాజకీయాలకు శంఖారావం' ఎన్నికలు వస్తే సెలవులొస్తాయి, తీర్థయాత్రకు వెళ్దాం అనుకుంటారని, అలా కాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. తన ప్రతీ కష్టంలో కొడంగల్ ప్రజలు అండగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ఓటు హక్కు చాలా విలువైందని, తనకు ఎన్ని కార్యక్రమాలున్నా ఓటు వేసేందుకు కొండగల్ వచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌లో ఓటు వేసిన అనంతరం కొడంగల్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంత చేసిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, త్వరలో ఈ ప్రాంతానికి సిమెంటు పరిశ్రమలు రాబోతున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నా, గత పాలకుల నిర్లక్ష్యంతో పరిశ్రమలు రాలేదని, పరిశ్రమల ఏర్పాటు జరిగితే ఈ ప్రాంతంలో భూముల విలువలు పెరుగుతాయన్నారు. ఈ ప్రాంతానికి ఫార్మా కంపెనీలు వస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూ సేకరణకు సహకరిస్తేనే పరిశ్రమల ఏర్పాటు సులభతరం అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. భూసేకరణలో పట్టా భూములకు, అసైన్డ్ భూములకు ఒకే ధర చెల్లించాలని మిగతా 2లో..

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

### రైతులు ఆగమైపోతున్నా పట్టింపులేదు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



సిరిసిల్ల,మార్చి 28 (ప్రజా మంటలు): కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య విధానాల వల్ల రైతులు ఆగమైపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సారంపల్లిలో ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను కేటీఆర్ పరిశీలించారు. పంటల నష్టంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైతుల్లో భరోసా నిపండానికి క్షేత్రస్థాయిలో మిగతా 2లో..

# కేజ్రీవాల్‌కు మరో నాలుగు రోజుల కస్టడి

- ఏప్రిల్1న కోర్టు ముందు ప్రవేశ పెట్టాలని ఆదేశం
- దేశం ముందు ఆప్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నం
- ఇదంతా రాజకీయ కుట్ర అన్న కేజ్రీవాల్



న్యూఢిల్లీ, మార్చి 28 (ప్రజా మంటలు): దిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈడీ కస్టడీని దిల్లీ న్యాయస్థానం మరో నాలుగు రోజుల పాటు పొడిగించింది. ఏప్రిల్ 1వరకు ఆయన్ను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ నిర్ణయం వెల్లడించింది. గతంలో విధించిన ఏడు రోజుల కస్టడీ గురువారంతో ముగియడంతో ఈడీ అధికారులు ఆయన్ను రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట హాజరుపరిచారు. మద్యం కేసులో కేజ్రీవాల్‌ను ఇంకా విచారించేందుకు మరో ఏడు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరగా.. నాలుగు రోజుల పాటు కస్టడీకి అనుమతించారు. ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 11గంటలకు తమ ఎదుట హాజరు పరచాలని ఆదేశించారు. కేజ్రీవాల్‌ను విచారించే సమయంలో ఐదు రోజులు స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశామని.. ఆయన దాటవేత సమాధానాలను చెబుతున్నారని ఈడీ ఆరోపించింది. డిజిటల్ పరికరాల పాస్‌వర్డ్‌లను ఆయన వెల్లడించలేదని రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. అదే సమయంలో మరో ముగ్గురు వ్యక్తుల వాంగ్మూలాలను సైతం రికార్డు చేసినట్లు తెలిపింది. అంతకముందు కేజ్రీవాల్ స్వయంగా కోర్టులో తన వాదనలు వినిపించారు. ఈ కేసులో తన పేరును నలుగురు సాక్షులు మాత్రమే ప్రస్తావించారని.. ఒక సీఎంను అరెస్టు చేసేందుకు ఆ వాంగ్మూలాలే సరిపోతాయా? అని 'ఈడీ'ని ఉద్దేశించి ప్రశ్నించారు. దేశం ముందు 'ఆప్'ను ఓ అవినీతి పార్టీగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈడీ విచారణను ఎదుర్కొనేందుకు తాను సిద్ధమేనని ఈ సందర్భంగా కేజ్రీవాల్ అన్నారు. మార్చి 21న కేజ్రీవాల్‌ను 'ఈడీ' అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దిల్లీ మద్యం విధానం కేసు 'రాజకీయ కుట్ర' అని.. దీనికి ప్రజలే సమాధానం చెబుతారని సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈడీ కస్టడీలో ఉన్న ఆయన్ను రౌస్ అవెన్యూ కోర్టులో నేడు హాజరుపరిచారు. కోర్టు ప్రాంగణంలోకి వెళ్తున్న సమయంలో అక్కడున్న విలేకరులతో ఆయన ఈవిధంగా వ్యాఖ్యానించారు.


## తెలంగాణలో రసవత్తర రాజకీయం

**కాంగ్రెస్ గూటికి చేరనున్న మేయర్ విజయలక్ష్మి**
**30న ముహూర్తం ఖరారు అయినట్లు ప్రచారం**
**విషయం తెలుసుకుని కెకెను పిలిచి మాట్లాడిన కెసిఆర్**
**గట్టిగానే కేశవరావును మందలించినట్లు సమచారం**



హైదరాబాద్, మార్చి 23 (ప్రజా మంటలు): తెలంగాణలె రసవత్తర రాజకీయాలు నడుస్తున్నాయి. నగర మేయర్ విజయలక్ష్మి 30న కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ క్రమంలో ఆమె తండ్రి, ఎంపి కె కేశవరావు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే పార్టీ మారే ఉద్దేశం ఉన్నట్లు కెసిఆర్‌కు చెప్పడంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల కేకే వ్యవహరిస్తున్న తీరుపై కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నీ ఫ్యామిలీకి పార్టీ ఏం తక్కువ చేసింది. సాకులు చెప్పవద్దు. తగిన ప్రాధాన్యత ఇచ్చినా ఎందుకు పార్టీ మారుతున్నారు మిగతా 2లో..

## ప్రజా నాడి



# కాంగ్రెస్‌లోకి కడియం..

- బరి నుంచి తప్పకున్న భారాస అభ్యర్థి కావ్య
- మాజీ సీఎం కేసీఆర్‌కు కీలక లేఖ
- బీఆర్ఎస్‌కు జనాదరణ కరువైందని వెల్లడి
- స్కామ్‌లు, భూకబ్జాలు

పార్టీ ప్రతిష్ట దిగజార్చాయని ఆవేదన



వరంగల్ /హైదరాబాద్ మార్చి 28 (ప్రజా మంటలు): పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే కీలక నేతలందరూ వరుసగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరుతున్న విషయం తెలిసిందే. ఇదేకోవలో వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు కడియం కావ్య స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్‌కు ఈ విషయంపై కావ్య లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, పార్టీకి జనాదరణ కరువైన నేపథ్యంలో ఎంపీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు కావ్య ప్రకటించారు. జిల్లా నేతల మధ్య సమన్వయం కొరవడిందని, ఎవరికి వారే అన్నట్టుగా ఉంటున్నారని ఆమె తెలిపారు. ఈ పరిస్థితుల్లో తప్పుకోవాలని అనుకుంటున్నా.. ఇప్పటికే పార్టీ ప్రతిష్ట దిగజారింది. అధినేత కేసీఆర్, కార్యకర్తలు మన్నించాలని ఆమె లేఖలో పేర్కొన్నారు అయితే స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ బరిలో వరంగల్ కాంగ్రెస్ నుంచి కడియం శ్రీహరి లేదా కావ్యకు టికెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## కసబ్‌ను పట్టుకున్న పోలీసు ధీరుడు

### సదానంద వసంత్‌కు ఎన్ఐఎ డైరెక్టర్‌గా ప్రమోషన్



న్యూఢిల్లీ, మార్చి 28 (ప్రజా మంటలు): మహారాష్ట్ర 'ఉగ్రవాద వ్యతిరేక దళం' అధిపతిగా ఉన్న సదానంద్ వసంత్ దాతెను 'జాతీయ దర్యాప్తు సంస్థ' ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ పదవిలో ఉన్న దినకర్ గుప్తా ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో రాబోతున్న 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి వసంత్– 2026 డిసెంబరు 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 26/11 దాడిగా పేరొందిన ముంబయి పేలుళ్ల ఘటనలో కీలక ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, అబు ఇస్మాయిల్‌లను పట్టుకున్నది వసంతే. అప్పుడు ఆయన ముంబయి అదనపు పోలీసు కమిషనర్‌గా ఉన్నారు. ఉగ్రవాదులు విసిరిన గ్రనేడ్ పేలి.. కాళ్లూచేతులకు తీవ్రగాయాలై, చాలారక్తం కోల్పోయి తాను స్పృహతప్పి పడిపోయేంతవరకు దాదాపు గంటసేపు ఆయన వీరిద్దరినీ ఆనాడు వదల్లేదు. గ్రనేడ్ తునకలు శరీరాన్ని చీల్చినా వెనక్కి తగ్గకుండా కాల్పులు జరుపుతూ, సీనియర్ అధికారులకు ముఖ్యమైన సమాచారం చెబుతూ ఎదురుదాడి పనిని సులభతరం చేశారు. ఆనాటి సాహసోపేత చర్యకు గానూ ఆయన రాష్ట్రపతి పోలీసు పతకాన్ని కూడా అందుకున్నారు. ఉగ్రదాడుల కేసుల దర్యాప్తు నిపుణుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ముంబయి ఘటన అనంతరం ఉగ్రదాడుల నిర్మూలనకు ఎన్ఐఏ ఆవిర్భవించగా 16 ఏళ్ల తర్వాత ఇప్పుడు దాని పగ్గాలు ఆయన చేతికి దక్కాయి. అధునాతన ఆయుధాలను అలవోకగా వినియోగించగలిగే సామర్థ్యం ఉన్న వసంత్ దాతె.. మరాఠీలో ఒక పుస్తకం కూడా రాశారు. పేద కుటుంబానికి చెందిన ఆయన పుణెలో కొన్నాళ్లు దినపత్రికలు విక్రయించారు. 'జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం' (ఎన్‌డీఆర్ఎఫ్) అధిపతి అతుల్ కర్వాల్ స్థానంలో పీయూష్ ఆనంద్‌ను కేంద్రం నియమించింది. ఆనంద్ ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ ప్రత్యేక డీజీగా ఉన్నారు. 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్, డెవలప్‌మెంట్' డైరెక్టర్ జనరల్‌గా రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐపీఎస్ రాజీవ్ కుమార్ శర్మ నియమితులయ్యారు. ఎస్పీజీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఎస్.సురేశ్‌ను నియమించారు.

మొదటి పేజీ తరువాయి

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

పర్యటిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పటిరకు చేయలేదని విమర్శించారు. రైతుబంధుకు కేసీఆర్ సర్కార్ రూ.7 వేల కోట్లు సిద్ధంచేసిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పంటసాయాన్ని ఆపిందని చెప్పారు. తాము రైతుల కోసం ఉంచిన డబ్బులను కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, చివరికి వారిని కూడా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను రిపేర్ చేయడానికి రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని విమర్శించారు.

## సిజెఐతో సిఎం రేవంత్ భేటీ

రాజేంద్రనగర్ లో బుధవారం జరిగిన నూతన హైకోర్టు నిర్మాణానికి సీజేఐ డీవై చంద్రచూడ్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సీజేఐని సీఎం రేవంత్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా హైకోర్టు నిర్మాణం గురించి వారి మధ్య కాసేపు చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది.

## ముగిసిన మహబుబ్ నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్

## ఓటేసిన సిఎం రేవంత్..ఎమ్మెల్యే బండ్ల

ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఆయన ఓటు వేశారు.స్థానిక సంస్థల కోటా ఎన్నికలో మొత్తం 1439 మందికి ఓటు హక్కు ఉంది. ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, పురపాలక కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1439 మంది ఓటర్లలో 900 మంది గతంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులే. కానీ.. వీరిలో చాలా మంది ఇప్పటికే హస్తం గూటికి చేరారు. ఇంకొందరు కాంగ్రెస్ కు టచ్ లో ఉన్నట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్ కు క్రాస్ ఓటింగ్ జరుగుతుందని అంచనా వేశారు. 1439 మంది ఓటర్లలో 888 మంది ఎంపీటీసీలు, 83 మంది జడ్పీటీసీలు, 449 మంది కౌన్సిలర్లు 14 మంది ఎమ్మెల్యేలు ఇద్దరు ఎంపీలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పోలింగ్ పక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికకై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలు చేశారు. ఓటర్లను రెండు ప్రధాన పార్టీలు క్యాంపులకు తీసుకెళ్లాయి. ఇతర పార్టీలు ప్రలోభ పెట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో బీఆర్?స్ క్యాంపులకు వెళ్లిన వాళ్లు కూడా పెద్దగా లేరనన అభిప్రాయం వినిపిస్తోంది. అందుకే విజయంపై కాంగ్రెస్ పార్టీ ధీమాగా ఉంది. అధికార కాంగ్రెస్ నుంచి.. టిటిడి బోర్డు మాజీ మెంబర్ జీవన్ రెడ్డి బరిలో ఉండగా.. బీఆర్ఎస్ తరఫున జడ్పీ మాజీ చైర్మన్ నవీన్ కుమార్ రెడ్డి, ఇండిపెండెంట్ గా సుదర్శన్ గౌడ్ పోటీ పడుతున్నారు. ఎలాగైనా సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ తపన పడుతుండగా.. అధికార కాంగ్రెస్ ఆ స్థానాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు చేసింది. ఏ పార్టీ వ్యూహాలు ఫలిస్తాయో చూడాలి. ఏప్రిల్ 2న ఉపఎన్నిక ఫలితం వెలువడనుంది. పూర్తి స్థాయిలో బలం ఉన్నా.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓడిపోతే బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలినట్లవుతుంది. ఉపఎన్నికలో మహబూబ్ నగర్ శాసన మండలి స్థానానికి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం వరకు దాదాపు 60 శాతం మంది తమ ఓటును వినియోగించుకున్నారు. పదవీరీత్యా కొడంగల్ ఎంఎల్ఏగా ముఖ్యమంత్రి ఎం. రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇది ఆయన స్వంత నియోజకవర్గం కూడా.

ఎంఎల్సి కసిరెడ్డి నారాయణ రెడ్డి రాజీనామా చేయడంతో ఈ ఉపఎన్నిక చోటుచేసుకుంది. ఆయన ఇదివరలో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 2న జరుగనున్నది. ఉప ఎన్నికల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తన ఓటు హక్కును జడ్ పి కార్యాలయం సమావేశం మందిరంలో వినియోగించుకున్నారు. గద్వాల జిల్లా పోలింగ్ కేంద్రంలో ఆయన తన ఓటును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే వెంటనే ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మున్సిపల్ చైర్మన్ బి.ఎస్ కేశవ్, జెడ్పి చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై బిగుసుకుంటున్న ఉచ్చు

విషయాలు బయటికొస్తున్నాయి. ఇప్పటికే దర్యాప్తులో కీలక విషయాలను రాబట్టిన ఉన్నతాధికారులు మరింత వేగం పెంచారు. ఈ కేసులో మరో ఇద్దర్ని.. పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆ ఇద్దర్నీ పోలీసు అధికారులు విచారిస్తున్నారు. రాధాకిషన్, గట్టు మల్లులను విచారిస్తున్నారు. వీరు ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు ట్యాపింగ్ చేశారని గుర్తించారు. ఈ ఇద్దరు కూడా పోలీసు అధికారులే కావడం గమనార్హం. బుధవారం రాత్రి అధికారులను అదుపులోనికి తీసుకున్న పోలీసులు.. లోతుగా విచారణ చేపడుతున్నారు. ముఖ్యంగా.. ఈ కేసులో నిందితుడైన ప్రణీత్‌రావుతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. ఇవాళ అంతా విచారించి.. ఆ ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాగా.. ప్రణీత్‌కు సహకరించిన ప్రతి ఒక్కర్నీ విచారించాలని దర్యాప్తు బృందం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే మాటల యుద్ధం జరుగుతోంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు శివారు కమిషనరేట్‌నూ తాకిన సంగతి తెలిసిందే.ఎస్ఐబీలో సేవలందించిన 15 మంది అధికారులు, సిబ్బందికి ఈ కేసుతో సంబంధాలున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వీరంతా ఏళ్ల తరబడి ఇంటెలిజెన్స్‌లో పాతుకుపోయినట్లు తెలుస్తోంది. కొందరైతే ఎస్పీ, డీఎస్పీ స్థాయిలో పదవీ విరమణ చేసినా.. ఓఎస్డీలుగా కొనసాగారు. ట్యాపింగ్ వ్యవహారంలో వీరు కూడా కీలక పాత్రధారులు అని తెలుస్తోంది. ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పక్క రాష్ట్రాలను కూడా తాకినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు ముమ్మరం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి సిట్ అధికారులు త్వరలో డీజీపీ, అదనపు డీజీపీ స్థాయి అధికారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రధాన కార్యాలయం లక్డీకాపూల్‌లో ఉన్నప్ప టికీ... గ్రీన్‌ల్యాండ్స్‌లోని ఎస్ఐబీ కార్యాలయంలో కూడా ఆయనకు ఓ ఛాంబర్ ఉంది. గడిచిన కొన్నేళ్లుగా నిఘా విభాగాధిపతి అక్కడకు రాక పోవడంతో ప్రణీత్ రావు ఈ ఛాంబర్‌తో పాటు పక్కన ఉన్న రూమ్‌ను తన అక్రమ ట్యాపింగ్ వ్యవహారాల కోసం వార్‌రూమ్‌గా వినియోగించుకున్నట్లు తేలింది. ఆ చాంబర్ ఇతరులు విని యోగించాంటే కచ్చితంగా నిఘా విభాగాధిపతి, డీజీపీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి అప్పట్లో ఏ కారణం చెప్పి ఈ అనుమతి తీసుకు న్నారు? ట్యాపింగ్ వ్యవహారాలు తెలిసే అను మతి ఇచ్చారా? లాంటి సందేహాలు నివృత్తి చేసుకోవడానికి గాను వీరికి నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నల కస్టడీ పిటిషన్లతో పాటు ఈచట్టాన్ని జోడిస్తూ మెమోను కూడా అధికారులు కోర్టులో దాఖలుచేశారు. హార్డ్‌డిస్క్‌ల విధ్వంసంలో ప్రణీత్‌రావుతో కలిసి పాల్గొన్న హెడ్ కానిస్టేబుల్ కైతోజు కృష్ణను ఈ కేసులో సాక్షిగా చేర్చారు. నాటి ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు గత ఏడాది డిసెంబర్ 4న అర్ధరాత్రి కృష్ణతో కలిసే ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ తాను ఏర్పాటు చేసుకున్న వార్ రూమ్‌తో పాటు అధికారిక ట్యాపింగ్‌లు జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను కృష్ణ ద్వారా ఆఫ్ చేయించాడు. అతని సహాయంతో వార్ రూమ్‌లోని 17 కంప్యూటర్లలో ఉన్న వాటితో పాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్ డిస్క్‌ల్నీ ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ధ్వంసం చేశాడు. ఈ కారణంగానే సిట్ అధికారులు కృష్ణను సాక్షిగా చేర్చారు. త్వరలో ఇతడితో న్యాయస్థానంలో స్టేట్‌మెంట్ రికార్డు చేయించాలని నిర్ణయించారు. ఇప్పటికే సిట్ కృష్ణ వాంగ్మూలం నమోదు చేయగా.. భవిష్యత్తులో అతను సాక్ష్యం చెప్పకుండా ఎదురుతిరిగే అవకాశం లేకుండా ఈ చర్య తీసుకోనున్నారు.

## తెలంగాణలో రసవత్తర రాజకీయం

' అంటూ ఆయన వద్దే అసహనం వ్యక్తం చేశారు. కేశవరావు వచ్చి కలిసిన సందర్భంలో కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా ఈ భేటీ అనంతరం కేకే కూడా తీవ్ర అసహనంతో ఇంటికి వెళ్లిపోయారు. ఇక కేకే నివాసానికి మాజీ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి వెళ్లడం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఇంద్ర కరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారంటూ ఊహాగానాలు వస్తున్నాయి. కేసీఆర్‌తో భేటీ అనంతరం కే కేశవరావు తన అసహనాన్ని మీడియాపై ప్రదర్శించారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌజ్ నుంచి తన నివాసానికి చేరుకున్న సమయంలో మీడియా ప్రతినిధులు విజువల్స్ తీస్తుండగా ఫ్రస్టేషన్‌కు గురయ్యారు. ఇంటివద్ద వీడియోలు తీస్తున్న ప్రతినిధులపైకి దురుసుగా దూసుకొచ్చారు. నన్ను వీడియో తీసుకోండి అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. కాగా కేకే కూతురు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైంది. 30న ఆమె పార్టీలో చేరబోతున్నట్లు క్లారిటీ వచ్చింది. కాగా కే కేశవ రావు కూడా హస్తం పార్టీ గూటికి చేరబోతున్నారంటూ ఊహాగానాలు వెలువడుతున్నాయి. పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికరమైన చర్చ కూడా జరగుతోంది. మరి కేకే ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి. మరోవైపు కేకే కుమారుడు విప్లవ్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరబోనని ప్రకటన చేశారు.గురువారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌తో కేకే భేటీ అయ్యారు. తమ పట్ల, తమ పార్టీ పట్ల కేకే వ్యవహరిస్తున్న తీరుపై ఈ సందర్భంగా కేసీఆర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సైతం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు దీపా దాస్ మున్షితో భేటీ అయ్యారు. దీంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మితోపాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు పార్టీ వీడుతున్నట్లు ఓ వైపు ప్రచారం జరుగుతుండగా... మార్చి 30న సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కేకే కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని మీడియాలో వైరల్ అవుతోంది. కేకే పార్టీ మార్పుపై సమాచారం అందుకున్న మాజీ సీఎం కేసీఆర్.. కేకేను ఫామ్ హౌస్‌కు పిలిపించుకొని తలంటినట్లు తెలుస్తోంది.

# ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు ముమ్మరం

### త్వరలో డీజీపీ, అదనపు డీజీపీ స్థాయి అధికారులకు నోటీసులు

హైదరాబాద్, మార్చి 22 (ప్రజా మంటలు):

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి సిట్ అధికారులు త్వరలో డీజీపీ, అదనపు డీజీపీ స్థాయి అధికారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రధాన కార్యాలయం లక్డీకాపూల్‌లో ఉన్నప్ప టికీ... గ్రీన్‌ల్యాండ్స్‌లోని ఎస్ఐబీ కార్యాలయంలో కూడా ఆయనకు ఓ ఛాంబర్ ఉంది. గడిచిన కొన్నేళ్లుగా నిఘా విభాగాధిపతి అక్కడకు రాక పోవడంతో ప్రణీత్ రావు ఈ ఛాంబర్‌తో పాటు పక్కన ఉన్న రూమ్‌ను తన అక్రమ ట్యాపింగ్ వ్యవహారాల కోసం వార్‌రూమ్‌గా వినియోగించుకున్నట్లు తేలింది. ఆ చాంబర్ ఇతరులు విని యోగించాంటే కచ్చితంగా నిఘా విభాగాధిపతి, డీజీపీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి అప్పట్లో ఏ కారణం చెప్పి ఈ అనుమతి తీసుకు న్నారు? ట్యాపింగ్ వ్యవహారాలు తెలిసే అను మతి ఇచ్చారా? లాంటి సందేహాలు నివృత్తి చేసుకోవడానికి గాను వీరికి నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నల కస్టడీ పిటిషన్లతో పాటు ఈచట్టాన్ని జోడిస్తూ మెమోను కూడా అధికారులు కోర్టులో దాఖలుచేశారు. హార్డ్‌డిస్క్‌ల విధ్వంసంలో ప్రణీత్‌రావుతో కలిసి పాల్గొన్న హెడ్ కానిస్టేబుల్ కైతోజు కృష్ణను ఈ కేసులో సాక్షిగా చేర్చారు. నాటి ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు గత ఏడాది డిసెంబర్ 4న అర్ధరాత్రి కృష్ణతో కలిసే ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ తాను ఏర్పాటు చేసుకున్న వార్ రూమ్‌తో పాటు అధికారిక ట్యాపింగ్‌లు జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను కృష్ణ ద్వారా ఆఫ్ చేయించాడు. అతని సహాయంతో వార్ రూమ్‌లోని 17 కంప్యూటర్లలో ఉన్న వాటితో పాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్ డిస్క్‌ల్నీ ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ధ్వంసం చేశాడు. ఈ కారణంగానే సిట్ అధికారులు కృష్ణను సాక్షిగా చేర్చారు. త్వరలో ఇతడితో న్యాయస్థానంలో స్టేట్‌మెంట్ రికార్డు చేయించాలని నిర్ణయించారు. ఇప్పటికే సిట్ కృష్ణ వాంగ్మూలం నమోదు చేయగా.. భవిష్యత్తులో అతను సాక్ష్యం చెప్పకుండా ఎదురుతిరిగే అవకాశం లేకుండా ఈ చర్య తీసుకోనున్నారు.

# న్యాయవ్యవస్థను సమగ్రతను దెబ్బతీసేందుకు కుట్రలు

న్యూఢిల్లీ, మార్చి 22 (ప్రజా మంటలు):

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సుమారు 500 మందికిపైగా న్యాయవాదులు లేఖ రాశారు. న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ లేఖ రాశారు. న్యాయస్థానాల కోసం నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని లేఖలో పేర్కొన్నారు. లేఖ రాసిన వారిలో ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, మనన్ కుమార్ మిశ్రా, ఆదిష్ అగర్వాల్, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్, హితేష్ జైన్, ఉజ్వల వార్, ఉదయ్ హోల్లా, స్వరూపమా చతుర్వేది, సహా దేశవ్యాప్తంగా 500 మందికిపైగా న్యాయవాదులు లేఖ రాశారు. న్యాయవ్యవస్థ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని లేఖలో ఈ లాయర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని 'ప్రత్యేక బృందాలు' న్యాయ పక్రియను ప్రభావితం చేయడానికి.. కోర్టు నిర్ణయాలను ప్రభావితం చేయడానికి 'కొన్ని ప్రత్యేక బృందాలు' ప్రయత్నిస్తున్నాయని న్యాయవాదులు ఆరోపించారు. రాజకీయ ఉద్దేశాలతో ఈ వర్గాలు నిరాధార ఆరోపణలు చేస్తూ న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని లేఖలో ఆరోపించారు. న్యాయవ్యవస్థపై తప్పుడు కథనాలను ప్రచారం చేయడంతో పాటు, ప్రస్తుత విచారణలను కించపరచడం.. న్యాయస్థానాలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని న్యాయవాదులు లేఖలో ప్రస్తావించారు. న్యాయవ్యవస్థను ప్రభావితం చేయడానికి, న్యాయస్థానాలను అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ సమగ్రతను కాపాడేందుకు ఈ దాడులకు వ్యతిరేకంగా రక్షణ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను కోరారు. సవాళ్లను పరిష్కరించడంలో నిర్ణయాత్మక నాయకత్వాన్ని కోరుతూ.. ప్రజాస్వామ్యానికి బలమైన స్తంభంగా ఉండేలా న్యాయవ్యవస్థకు మద్దతుగా ఐక్యంగా నిలబడాలని లేఖలో న్యాయవాదు కోరారు.

# ఇన్‌కమ్ టాక్స్ వ్యవహారం

## కాంగ్రెస్ దరఖాస్తును తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 22 (ప్రజా మంటలు):

పన్ను అధికారులు నాలుగేళ్ల కాలానికి ట్యాక్స్ రీ–అసెస్మెంట్ చర్యలు చేపట్టడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు గురువారం తిరస్కరించింది. న్యాయమూర్తులు యశ్వంత్ వర్మ, పురుషేంద్ర కుమార్ కౌరవ్ లతో కూడిన ధర్మాసనం కాంగ్రెస్ వినతులను కొట్టివేస్తున్నట్లు పేర్కొంది. మరో సంవత్సరం రీ–అసెస్మెంట్ విషయంలో జోక్యం చేసుకోబోమని ఇదివరలో తీసుకున్న నిర్ణయం మేరకు పిటిషన్ ను పరిశీలించబోమని పేర్కొంది. ప్రస్తుత అంశం 2017 నుంచి 2021 సంవత్సరాలకు సంబంధించింది. కాంగ్రెస్ తన ఇదివరకటి పిటిషన్ లో అసెస్మెంట్ సంవత్సరాలు 2014–15 నుంచి 2016–17కు సంబంధించిన ప్రొసీడింగ్ లను సవాలుచేసింది.ఇదిలావుంటే తెలంగాణలో పోటీ చేసే ఎంపీ అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ విడుదల చేసింది. ఢిల్లీలో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరిగింది. ఇందులో తెలంగాణ నుంచి నలుగురికి అవకాశం కలిపించింది. మిగిలిన స్థానాలకు అభ్యర్థులను త్వరలోనే ప్రకటించనుంది. నిజామాబాద్ నుంచి జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ నుంచి సుగుణ కుమారి, మెదక్ నుంచి నీలం మధు, భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ పోటీ చేయనున్నట్లుగా తెలిపింది. కాగా కాంగ్రెస్ ఇంకా ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కాగా ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి.

# న్యాయవాదుల లేఖ వెనక కాంగ్రెస్

## మండిపడ్డ ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, మార్చి 22 (ప్రజా మంటలు):



ఇతరులను వేధించడం, వారిపై కన్నెర్ర చేయడం కాంగ్రెస్ సంస్కృతి అని ప్రధాని మోడీ విమర్శించారు. దేశంలో న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ 600 మందికి పైగా లాయర్లు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. రాజకీయ నేతలకు సంబంధించిన కేసుల్లో కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు కొన్ని స్వార్థమూకలు ఒత్తిడి వ్యూహాలను అమలుచేస్తున్నాయని అందులో ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ.. కాంగ్రెస్ వెనక ఉండి నడిపస్తోందిన మండిపడ్డారు. అయిదు దశాబ్దాల క్రితం వారే కేంద్రానికి కట్టుబడి ఉండే న్యాయవ్యవస్థ కోసం పిలుపునిచ్చారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇతరుల నుంచి నిబద్ధతను కోరుకుంటారు. కానీ.. దేశంపై మాత్రం ఎటువంటి నిబద్ధతను చాటుకోరు. 140 కోట్ల మంది భారతీయులు వారిని ఎందుకు దూరం పెడుతున్నారో ఆశ్చర్యపోనవసరం లేదని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. రాజకీయ అజెండాతో స్వార్థ ప్రయోజనాలను ఆశించే కొన్ని గ్రూప్‌లు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాయని మండిపడ్డారు. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నాయన్నారు. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను అనుమతించ కూడదన్నారు. ఇలాంటి వాటిపై మౌనంగా ఉంటే.. హాని చేయాలనుకునేవారికి మరింత బలం ఇచ్చినట్లేనని అన్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరుతున్నాం అని న్యాయవాదులు తమ లేఖలో కోరారు.

# శివసేనలో చేరిన నటుడు గోవిందా

## ముంబై నుంచి పోటీ చేసే అవకాశం



ముంబయి, మార్చి 22 (ప్రజా మంటలు):

బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా మరోసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. గురువారం ఆయన శివసేన (శిందే వర్గం) పార్టీలో చేరారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే బాలాసాహెబ్ భవన్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శివసేన (శిందే వర్గం) తరపున వాయువ్య ముంబయి లోక్‌సభ స్థానం నుంచి గోవిందా పోటీ చేయనున్నారు. శివసేన (శిందే వర్గం)అధికార ప్రతినిధి క్రిష్ణ హెగ్డే బుధవారం గోవిందాను ఆయన నివాసంలో కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం గోవిందా సీఎం శిందే సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో గోవిందా ఉత్తర ముంబయి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో భాజపా సీనియర్ నాయకుడు రామ్ నాయక్‌ను ఓడించారు. తర్వాత కాంగ్రెస్‌కు, రాజకీయాలకు ఆయన దూరంగా ఉన్నారు. 2009 సహా తర్వాత ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. తాజాగా మరోసారి ఎన్నికల బరిలో నిలవనున్నారు. వాయువ్య ముంబయి స్థానం నుంచి శివసేన (యూబీటీ) అభ్యర్థిగా అమోల్ కీర్తికర్ పోటీ చేస్తున్నారు. మహారాష్ట్రలో భాజపా – శివసేన (శిందే వర్గం) – ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీలు 'మహాయుతి' కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. మరోవైపు, కాంగ్రెస్– శివసేన (యూబీటీ) – ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలు 'మహా వికాస్ అఘాడీ' కూటమిగా ఏర్పడిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 48 లోక్‌సభ స్థానాలుండగా.. వీటిలో 44 స్థానాలకు ఈ కూటమి పార్టీల మధ్య సర్దుబాటు జరిగింది. ఇందులో భాగంగా శివసేన (యూబీటీ) 19, కాంగ్రెస్ 16, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ పార్టీకి 9 సీట్లను కేటాయించారు. మిగతా నాలుగు స్థానాలకు చర్చలు జరుగుతున్నాయి. అయితే, తాము మొత్తం 22 స్థానాల్లో పోటీ చేస్తామని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ ముంబయిలో ఆరు స్థానాలను కోరుతుండగా.. సంజయ్ రౌత్ ప్రకటనపై ఆ పార్టీ అసహనంగా ఉన్నట్లు సమాచారం.

# ఎంపిగా లేకున్నా ఫలిబిత్ ప్రజలను వీడను

### ప్రజల సేవకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

### బిజెపి ఎంపి వరుణ్ గాంధీ భావోద్వేగ లేఖ



లక్నో, మార్చి 22 (ప్రజా మంటలు):

సొంత పార్టీపైనే విమర్శలు చేసి వార్తల్లో నిలిచిన భాజపా ఎంపీ వరుణ్ గాంధీ కి తాజా ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. ఉత్తరప్రదేశ్‌లో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పీలీభీత్ స్థానంలో ఈసారి రాష్ట్ర మంత్రి జితిన్ ప్రసాదను బిజెపి నిలబెట్టింది. దీంతో వరుణ్‌గాంధీ భవిష్యత్తు కార్యాచరణపై ఆసక్తి రేగింది. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా? లేదా కాంగ్రెస్‌లో చేరతారా?అనే ఉత్కంఠ నెలకొంది. ఈ పరిణామాల వేళ తన నియోజకవర్గ ప్రజలకు ఆయన భావోద్వేగపూరితమైన లేఖను రాశారు. ఈ ప్రాంతంతో తన బంధం విడదీయరానిదని చెప్పారు. 1983లో మూడేళ్ల వయసులో మా అమ్మ వేలు పట్టుకొని ఈ ప్రాంతంలో అడుగుపెట్టడం ఇప్పటికీ నాకు గుర్తే. ఈ ప్రజలంతా నా కుటుంబమే. ఎంపీగా నా పదవీకాలం ముగిసినా.. మీతో నా బంధం చివరిశ్వాస వరకు కొనసాగుతుంది. పీలీభీత్ ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇక్కడి ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు నేను ఎల్లప్పుడూ పనిచేస్తా. ఎంపీగా లేకపోయినా.. ఒక కుమారుడిగా మీకు సేవ చేస్తా. మీకోసం మా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. సామాన్యుల తరఫున గళమెత్తేందుకే రాజకీయాల్లోకి వచ్చా. ఎట్టిపరిస్థితుల్లో నూ అది కొనసాగించేందుకు మీ ఆశీర్వాదం కావాలి అని వరుణ్ రాసుకొచ్చారు. కొంతకాలంగా భాజపా కేంద్ర, రాష్ట్ర నాయకత్వాల తీరుపై వరుణ్‌గాంధీ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈక్రమంలోనే గతేడాది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆయన కేదార్‌నాథ్‌లో కలుసుకోవడం ఆసక్తికర చర్చకు దారితీసింది. భాజపాకు దూరంగా ఉంటున్న ఆయన పార్టీ మారే అవకాశం ఉందంటూ అప్పట్లోనే వార్తలు వచ్చాయి. ఈనేపథ్యంలో తాజాగా ఆయనకు కమలదళంలో టికెట్ దక్కకపోవడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, వరుణ్ తల్లి మేనకాగాంధీని యూపీలోని సుల్తాన్‌పూర్ నుంచి భాజపా మరోసారి బరిలోకి దించింది.

మొదటి పేజీ తరువాయి

## 6న తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ

అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అభివృద్ధికి సహకరించకపోతే ఇక్కడి ప్రాంతం నష్టపోతుందన్నారు. తాను ఎక్కడున్నా ఓ కన్ను కొడంగల్‌పై ఉంటుందని, ఇక్కడి వాళ్లను ఎప్పుడూ కాపాడుకుంటానని సీఎం వెల్లడించారు.తాను ఎక్కడున్నా ఓ కన్ను కొడంగల్‌పైనే ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు.కొడంగల్‌లోని తన నివాసం వద్ద అభిమానులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొడంగల్ నుంచి కాంగ్రెస్‌కు 50 వేల మెజార్టీ ఇవ్వాలని కోరారు."ఎన్నికలు వస్తే సెలవులొస్తాయి.. తీర్థయాత్రలకు వెళ్దామని కొందరు అనుకుంటారు. ఓటు చాలా విలువైనది. ఎన్ని కార్యక్రమాలున్నా.. ఓటు వేసేందుకు కొడంగల్ వచ్చాను. కార్యకర్తలను కలవాలని వచ్చాను. నేను కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలు నా వెంట ఉన్నారు. ప్రచారానికి రాకున్నా గెలిపించారు. ఇక్కడికి సిమెంట్ పరిశ్రమ రాబోతోంది. పరిశ్రమలు వస్తే భూముల ధరలు పెరుగుతాయి. ఫార్మా కంపెనీలు వస్తే యువతకు ఉపాధి దొరుకుతుంది. ఏప్రిల్ 6న జరిగే తుక్కుగూడ కాంగ్రెస్ బహిరంగ సభకు.. కొడంగల్ నుంచి 25 వేల మంది తరలిరావాలి. ఈ సభలో రాహుల్ గాంధీ పాల్గొంటారు. 5 గ్యారంటీలు ప్రకటిస్తారు" అని చెప్పారు.

## జైలు నుంచి కేజ్రీవాల్ పాలనను అడ్డుకోలేం

సుర్జీత్ సింగ్ యాదవ్ అనే వ్యక్తి ఢిల్లీ హైకోర్టులో ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని విచారించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం.. పాలనాపరమైన విషయాల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. ఆచరణాత్మక ఇబ్బందులు ఉండవచ్చు.. కానీ, సీఎంగా కొనసాగడానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకి ఏంటని పిటిషనర్‌ను ప్రశ్నించింది.ఇదిలాఉంటే, ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో అరెస్టైన కేజ్రీవాల్.. జైలు నుంచే ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈడీ కస్టడీలో ఉన్నప్పటికీ.. ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ కొనసాగుతారని ఆప్ నేతలు చెబుతున్నారు. ఇలా ఢిల్లీ ప్రభుత్వం జైలు నుంచి నడవదు అని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా పేర్కొన్నారు.

# ఇంటర్ కాలేజీలకు సెలవుల ప్రకటన

## మార్చి 30 నుంచి మే 31 వరకు సెలవులు - ఇంటర్ బోర్డు ప్రకటన

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):




తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు సెలవులపై కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఇంటర్ కాలేజీలకు సెలవులు ప్రకటించింది. మార్చి 30వ తేదీ నుంచి అన్ని ఇంటర్ కాలేజీలకు సెలవులు ప్రకటించింది. ఇంటర్ బోర్డ్ ప్రకటన ప్రకారం.. మార్చి 30వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు సెలవులు ఉంటాయి. మళ్లీ జూన్ 1వ తేదీన కాలేజీలు తెరుచుకుంటాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ ఇంటర్ కాలేజీలకు ఈ సెలవులు వర్తిస్తాయని ప్రభుత్వం తెలిపింది. ఇంటర్ బోర్డు ఆదేశాలను పాటించకుండా.. ఏ కాలేజీ అయినా విద్యార్థులకు క్లాస్‌లు నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అధికారులు. వచ్చే విద్యా సంవత్సరానికి ఇంటర్ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని ఆదేశించింది ఇంటర్ బోర్డు. అడ్మిషన్ల కోసం తేదీలను ప్రకటించినప్పుడే ప్రవేశాల ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేసింది ఇంటర్ బోర్డు.

# జూనియర్ లెక్చరర్లకు పదోన్నతి

## విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, మార్చి 28 (ప్రజా మంటలు):

ఏపీ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జూనియర్ లెక్చరర్లకు పదోన్నతి కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో ఐదుగురు పిటీషనర్లు వ్యాజ్యాలు దాఖలు చేశారు. పిటీషన్ల వ్యాజ్యాలపై హైకోర్టు గురువారం నాడు విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ప్రిన్సిపాళ్లుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించింది. సిలబస్, పాఠ్యాంశాలపై లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ఏమి అవగాహన ఉంటుందని నిలదీసింది. ఈ జీవో ఇచ్చిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని జైలుకు పంపించాలని మందలించింది. సర్వీస్ ఉందని స్వీపర్‌ను కూడా ప్రిన్సిపాల్‌గా నియమిస్తారేమోనంటూ హైకోర్టు ఎద్దేవా చేసింది. అసమర్థులను విద్యాసంస్థలకు అధిపతులుగా నియమిస్తే.. వాటి తలరాతలు ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. ఇలాంటి ఉత్తర్వులను జారీ చేయడం ఆత్మహత్యా సదృశ్యమే అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ చర్యలను అనుమతిస్తే విద్యా వ్యవస్థ విధ్వంసానికి దారి తీస్తుందని మండిపడింది. జీవోపై వివరణ ఇచ్చేందుకు కోర్టు ముందు హాజరు కావాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. జూనియర్ కాలేజీల్లో 197 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్ ఉత్తర్వులను ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ విచారణను ఏప్రిల్ 1వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

# ఆస్తుల కాపాడుకోవడమే వివేక్ లక్ష్యం

## మండిపడ్డ బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్

గోదావరిఖని,మార్చి 28 (ప్రజా మంటలు):



కాంగ్రెస్ నేత వివేక్ వెంకటస్వామి కుటుంబానికి పేద ప్రజల బాధలు తెలియవని నాగర్‌కర్నూలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆస్తులు కాపాడుకోవడం వివేక్ వెంకటస్వామి కుటుంబం ఆరాటపడుతుందని విమర్శించారు. గోదావరిఖనిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్‌తో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ వస్తే ప్రాథమిక హక్కులు కోల్పోతామని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల తీసివేతకు కేంద్రం కుట్రలు చేస్తుందని ఆయన విమర్శించారు. బీజేపీ గెలిస్తే బహుజనులు సర్వహక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. దేశంలో ఈడీ దాడులు సరికాదని అన్నారు. పంటలకు నీరందక రైతులు నష్టపోతున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ అంతా భూటకమని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌లను గద్దె దించాలని ప్రజలను ఈ సందర్భంగా కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# అమరావతి రైతుల ఉద్యమం అసామాన్యం

## జస్టిస్ట ఎన్‌వి రమణ వ్యాఖ్యలు

అమరావతి, మార్చి 28 (ప్రజా మంటలు):

అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న సుప్రీంకోర్టుమాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు విజయా డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు , అమరావతి మహిళలు, రైతులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సీజేఐకు అమరావతి రైతులు, మహిళలు.. వినతిపత్రం అందజేశారు. జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ అమరావతి మహిళా రైతులు తమ కష్టాలు చెప్పారని, ప్రస్తుత ప్రభుత్వ విధానాల వలన1563 రోజులు నుంచి ఉద్యమం చేస్తున్నామని రైతులు వెల్లడించారన్నారు. రాజధాని నిర్మాణం కోసం రైతులు త్యాగం చేశారని, రాజధాని అమరావతి శంకుస్థాపనకు తాను కూడా వచ్చానని చెప్పారు. రైతుకు భూమికి ఉన్న సంబంధం తల్లి బిడ్డకు ఉన్న సంబంధం లాంటిదని, రైతు భూమి కోల్పోవడం సామాన్యమైన విషయం కాదని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా రైతులు భూములు ఇచ్చి నేరస్థుల్లా కోర్టులో నిలబడి అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేస్తారని అనుకుంటున్నానన్నారు. వాళ్లకు న్యాయ వ్యవస్థ కూడా పనిచేస్తుందని విశ్వసిస్తున్నానన్నారు. ఆలస్యం అయినప్పటికీ తప్పక న్యాయం జరుగుతుందని అనుకుంటున్నాని.. వారి ఉద్యమ విజయవంతం కావాలని కోరుకుంటున్నానని జస్టిస్ ఎన్వీ రమణ వ్యాఖ్యానించారు.

# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## దుబాయ్ మేడమ్ టూస్సాడ్స్‌లో మైనపు విగ్రహం - ఇది మరచిపోలేని రోజన్న బన్నీ

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరో అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. తాజాగా దుబాయ్‌లోని ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఐకాన్ స్టార్ మైనపు విగ్రహం కొలువు దీరింది. ఈ అరుదైన మైనపు విగ్రహాన్ని అల్లు అర్జున్ స్వయంగా దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంకు వెళ్లి తన సొంత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ అరుదైన అద్భుత క్షణాన్ని సొంతం చేసుకున్న అల్లు అర్జున్ ఎమోషనల్ ఫీల్ అవుతూ ఎక్స్ ద్వారా అభిప్రాయాన్ని పంచుకున్నారు.'ఈ రోజు చాలా స్పెషల్ డే..నా సినీ కెరీర్‌లో మొదటి చిత్రం గంగోత్రి సరిగ్గా మార్చి 28న 2003లో విడుదలైంది. అలాగే ఈరోజు 2024 మార్చి 28న నేను నా మైనపు విగ్రహాన్ని దుబాయ్‌లో మేడమ్ టుస్సాడ్స్ ఆవిష్కరించబడటం గొప్ప విషయంగా భావిస్తున్నాను. ఇది నా 21 సంవత్సరాల మరపురాని ప్రయాణం. ఈ ప్రయాణంలో మీలో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ నేను కృతజ్ఞుడను. అనుక్షణం నా అభిమానుల (ఆర్మీ) వారి అమితమైన ప్రేమ..ఎనలేని మద్దతుకు ప్రత్యేక ధన్యవాదాలు. రాబోయే సంవత్సరాల్లో మీ అందరినీ మరింత గర్వించేలా సినిమాలు చేస్తానని ఆశిస్తున్నాను' అంటూ తనదైన శైలిలో పోస్ట్ చేశారు. మేడమ్ టుస్సాడ్స్ లో ఆవిష్కరించబడిన ఫోటో బ్లాక్ బస్టర్ మూవీ అల వైకుంఠపురములో సినిమాలో బన్నీ ఐకానిక్ స్టైల్ తరహాలో అల్లు అర్జున్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి విగ్రహం వెనక ఫోటో మాత్రమే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఫ్రంట్ ఫోటో కోసం అల్లు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిజానికి చెప్పాలంటే ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫోటో పక్క బన్నీ నిల్చున్నాడు. ఇక్కడ ఒరిజినల్ ఏదో విగ్రహం ఏదో అనేది మాత్రం సస్పెన్స్ గా మారింది. పుష్ప చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందిన బన్నీ ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారం అందుకున్న తర్వాత ఇంతటి విశేష గౌరవాన్ని సొంతం చేసుకోవడం పట్ల సినీ ఫ్యాన్స్ తో పాటు ప్రముఖులు స్పెషల్ విషెస్ చెబుతున్నారు.

# అమెరికాలో తెలంగాణ వాసి గుండెపోటుతో మృతి

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):



తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అమెరికాలో గుండెపోటుతో చనిపోయాడు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం వంగ సుదర్శన్ రెడ్డి నగర్‌లో చిట్టోజు ప్రమీల, మదనాచారి దంపతుల పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసిన అనంతరం గత మూడు సంవత్సరాల క్రితం అమెరికాకు వెళ్లాడు. జార్జియాలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో మహేష్ విధులు నిర్వహిస్తుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి ఉద్యోగులు అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మహేష్‌కు భార్య రాధ, నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతదేహం అమెరికా నుంచి ఇండియాకు రావడానికి ఐదు రోజుల సమయం పడుతోంది.

# చెంగిచర్లకు వెళ్తానన్న గోషామహల్ ఎమ్మెల్యే

## అనుమతి లేదంటూ హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):

బిజెపి నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. గురువారం సాయంత్రం చెంగిచెర్లకు వెళతానని ఆయన ప్రకటించారు. అయితే అక్కడకు వెళ్లనిచ్చేది లేదంటూ పోలీసులు అతనిని హౌస్ అరెస్ట్ చేశారు. హోలీ పండుగ నాడు చెంగిచెర్లలో హిందువులపై ఓ వర్గం దాడి చేసింది. ఈ దాడిలో గిరిజన మహిళలు, యువకులు గాయపడ్డారు. గాయపడ్డ వారిని పరామర్శించేందుకు వెళ్తానని రాజాసింగ్ చెప్పడంతో పోలీసులు అతనికి అనుమతివ్వలేదు. ఈ ఘటనలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రాజాసింగ్ మండిపడ్డారు. దాడికి గురైన వారిపై కేసు ఎలా నమోదు చేస్తారని ఆయన ప్రశ్నించారు. చెంగిచెర్లకు వెళ్లి బాధితులను పరామర్శిస్తామంటే పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేయడం ఏమిటని నిలదీశారు. హిందువులపై అకారణంగా దాడి చేస్తే ఊరుకునేది లేదన్నారు. వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్లనీయరా? అని నిలదీశారు. గాయపడిన మహిళలకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామన్నారు.

# కార్ల గోదాంలో భారీగా మంటలు

## గండిపేట ఘటనలో దగ్ధమైన కార్లు

రంగారెడ్డి, మార్చి 28 (ప్రజా మంటలు):

రంగారెడ్డి జిల్లా గండిపేటలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఖానాపూర్‌లో ఓ కార్ల గోదాంలో భారీగా మంటలు చెలరేగాయి. అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో గోదాంలో ఉన్న కార్లన్నీ మంటల్లో చిక్కుకున్నాయి. గోదాంలో 25 కార్లు ఉండగా.. అవన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. భారీ మంటల కారణంగా నల్లటి పొగ దట్టంగా వ్యాపించింది. పొగతో స్థానిక ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం అని స్థానికులు చెబుతున్నారు. కాగా, ప్రమాదంపై సమాచారం అందుకున్న ÷ర్ సిబ్బంది.. ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అగ్ని ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ప్రమాదానికి గల కారణాలను నిర్దారించే పనిలో పడ్డారు.



కరీంనగర్ పట్టణంలోని అపోలో హాస్పిటల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జగిత్యాల ఆంధ్రజ్యోతి పత్రిక రిపోర్టర్ ప్రదీప్ ని పరామర్శించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.



# హత్య కేసులో నిందితుడికి రిమాండ్

## డిఎస్పి డి. రఘు చందర్

జగిత్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 28 (ప్రజామంటలు):



జగిత్యాల జిల్లా ధర్మపురి పీఎస్ పరిధిలో మార్చి26 రోజున కమలాపూర్ గ్రామానికి చెందిన పులి పద్మను అదే గ్రామానికి చెందిన పులి గంగయ్య అనునతడు ఉళి తో పొడిచి హత్య చేశాడు. ఇట్టి సంఘటనలో పులి గంగయ్యను గురువారం మార్చి 28 న రిమాండ్ కు తరలించడం జరిగినది అని డి. రఘు చందర్ డిఎస్పి జగిత్యాల జిల్లా వెల్లడించారు. డీఎస్పీ డి. రవిచంద్ర కథనం ప్రకారం పులి పద్మకు, ఆమె ఇంటి పక్కన ఉన్న పులి గంగయ్య అను అతడికి గత కొద్ది కాలం నుండి భూ సరిహద్దు విషయం గురించి గొడవలు జరుగుచున్నవి. అయితే మార్చి 26న కమలాపూర్ గ్రామంలో కాటమయ్య పండగ జరుగగా అట్టి కార్యక్రమానికి నిందితుడు పులి గంగయ్య హాజరయ్యాడు. ఇంటి వద్ద ఉన్న అతని భార్య పులి రేనా ఇంటిలో ఎవరు లేని సమయంలో వంట గదిలో చీరతో ఉరి వేసుకుని చనిపోయినది. ఇట్టి విషయం తెలిసిన నిందితుడు పులి గంగయ్య ఇంటికి వచ్చి అతని భార్య చనిపోయి ఉండడం చూసి ఆవేశంతో తన భార్య చనిపోవడానికి కారణం పులి పద్మ అని భావించి నిందితుడు కల్లు గీసే పరికరం ఉళి తీసుకొని పద్మ ఇంటిలోకి వెళ్లి పద్మను విచక్షనా రహితంగా పొడిచి హత్య చేసినాడు. ఈ సంఘటనపై మృతురాలి భర్త పులి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు నమోదు చేయడం జరిగినది. నేర పరిశోధనలో భాగంగా గురువారం ధర్మపురి సీఐ ఏ. రామ్ నర్సింహారెడ్డి, నిందితుడు పులి గంగయ్య ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి రిమాండ్ కు పంపడం జరిగినది. ఈ కార్యక్రమంలో ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ రామ్ నర్సింహారెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ పి. ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జనగామ ఎసిపి దామోదర్ రెడ్డిపై ఇసి వేటు

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):

ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంగించి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న జనగాం ఏసీపీ దామోదర్ రెడ్డి మీద ఈసీ వేటు వేసింది. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండగా ఏసీపీ దామోదర్ రెడ్డి ఈనెల 23న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభోత్సవంలో ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంగించి పాల్గొన్నారని ఎన్నికల సంఘానికి జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కంప్లైంట్‌పై విచారణ జరిపిన అనంతరం ఏసీపీ దామోదర్ రెడ్డినీ డీజీపీ ఆఫీస్‌కి అటాచ్ చేస్తూ ఈసీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

# హైకోర్టులో వివేకా హత్యకేసు: అవినాష్ ముందస్తు బెయిల్‌పై విచారణ

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు పిటిషన్‌పై గురువారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. తమ పిటిషనర్ బెయిల్ రద్దు చేయాలని.. కోరే అధికారం అప్రూవర్ దస్తగిరికి లేదని అవినాష్ తరపు న్యాయవాది వాదించారు. ఈ కేసులో నెల రోజుల క్రితమే ఎన్ఐఏ కేసులో అప్రూవర్ పిటిషన్‌ను డివిజన్ బెంచ్ అనుమతించిందని హైకోర్టు పేర్కొంది. అప్రూవర్‌కి అడిగే హక్కు డివిజన్ బెంచ్ తీర్పులో స్పష్టంగా ఉందని న్యాయస్థానం తెలిపింది. అప్రూవర్ దస్తగిరి పిటిషన్‌ను తిరస్కరించలేమని స్పష్టం చేసింది.తదుపరి విచారణ ఏప్రిల్ 4కు వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయించింది. ఈ క్రమంలో భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై అఃఎ కౌంటర్ దాఖలు చేయడంతో ఈ పిటిషన్లపై విచారణను ఏప్రిల్ 3కు విచారణ వాయిదా వేసింది.





జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో గాయత్రి మాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. వెంట అదువాల లక్ష్మణ్, గిరి నాగభూషణం, ఆకుబత్తిని శ్రీనివాస్, తాటిపాముల వినోద్ సాయి, మానపురి మహేష్ తదితరులున్నారు.

# కెసిఆర్ ఫామ్‌హౌజ్‌లోనే వార్ రూమ్

## డిజిపికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):



తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ సంచలన విషయాలు బయటికొస్తున్నాయి. ఇప్పటికే దర్యాప్తులో కీలక విషయాలను రాబట్టిన ఉన్నతాధికారులు మరింత వేగం పెంచారు. ఈ కేసులో మరో ఇద్దరిని.. పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. కాగా ఈ కేసుపై తెలంగాణ డీజీపీ రవిగుప్తాను కాంగ్రెస్ నాయకులు బండి సుధాకర్, సమ్మిరెడ్డి గురువారం నాడు కలిసి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ ఫార్మ్ హౌజ్‌ను తనిఖీ చేయాలని కోరారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో కూడా వార్ రూం ఉందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తూ వ్యాపారుల నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సంపాదించిన ఆస్తుల వివరాలు బయట పెట్టాలని కోరారు. ఏసీబీ , ఈడీ ద్వారా ఈ కేసును దర్యాప్తు చేయించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు !



తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ సంచలన విషయాలు బయటికొస్తున్నాయి. ఇందులో ప్రధానంగా నాటి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తన అధికారం నిలుపుకోవడంతో పాటు..విపక్ష పార్టీలను సర్వనాశనం చేయడం..బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడడం, వ్యాపారుల వద్ద డబ్బులు లాగడం వంటి అనేక అక్రమాలకు పాల్పడ్డట్లుగా విచారణలో బయటపడుతోంది.ప్రాంతీయ పార్టీలు ఎంతగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతాయనడానికి కెసిఆర్ ప్రభుత్వ ఫోన్ ట్యాపింగ్ పెద్ద ఉదాహరణ. అందుకే వరుసగా రెండోసారి విజయం సాధించారు. మూడోసారి కూడా విజయం తప్పదన్న ధీమాలో ఉన్నా లెక్క తప్పింది. ఇప్పుడు నాటి అక్రమాలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేయడమే గాకుండా, అవినీతి అక్రమాలకు పాల్పడ్డ నేతగా కెసిఆర్ చరిత్ర సృష్టించారు. ఇందుకు మూల్యం చెల్లించుకున్నారు. ఇంకా చెల్లించుకోబోతున్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఇప్పటికే దర్యాప్తులో కీలక విషయాలను రాబట్టిన ఉన్నతాధికారులు మరింత వేగం పెంచారు. ఈ కేసులో మరో ఇద్దర్ని.. పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలిస్ స్టేషన్‌లో ఆ ఇద్దర్నీ పోలీసు అధికారులు విచారిస్తున్నారు. కాగా ఈ ఇద్దరు కూడా పోలీసు అధికారులే కావడం గమనార్హం. ఆ ఇద్దరు అధికారులను అదుపులోనికి తీసుకున్న పోలీసులు.. లోతుగా విచారణ చేపడుతున్నారు. ముఖ్యంగా.. ఈ కేసులో నిందితుడైన ప్రణీత్‌రావుతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. విచారించిన తరవాత ఆ ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కాగా.. ప్రణీత్‌కు సహకరించిన ప్రతి ఒక్కర్నీ విచారించాలని దర్యాప్తు బృందం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే మాటల యుద్ధం జరుగుతోంది. ట్యాపింగ్ వ్యవహారంలో వీరు కూడా కీలక పాత్రధారులు అని తెలుస్తోంది. ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పక్క రాష్ట్రాలను కూడా తాకినట్లు దర్యాప్తు అధికా రులు గుర్తించారు. మరోవైపు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.ఇప్పటికే మాజీ బిజెపి ఎమ్మెల్యే డిజిపికి ఫిర్యాదు చేశారు. తానే మొదటి బాధితుడినని అన్నారు. కెసిఆర్,కెటిఆర్, హరీష్ రావులపై విచారణ కోరారు. ఇకపోతే ఇది వ్యాపారవర్గాలను బెదరించి సొమ్ము చేసుకోవడానికి కూడా ఉపయోగించారు. సినిమాల్లో జరిగినట్లుగానే ఇదంతా జరగడం ఆశ్యర్యకరంగా ఉంది. రియల్ ఎస్టేట్ పరంగా కీలకమైన జోన్లు కావడంతో.. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసి, విధేయతను చాటుకున్నారని సమాచారం. సదరు డీసీపీ గత ప్రభుత్వ పెద్దలకు సమీప బంధువు కావడంతో.. సీపీ స్థాయి అధికారి కూడా ఆయన చర్యలను పెద్దగా పట్టించుకునే వారు కాదని భావిస్తున్నారు. ఎస్ఐబీలో సేవలందించిన 15 మంది అధికారులు, సిబ్బందికి ఈ కేసుతో సంబంధాలున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వీరంతా ఏళ్ల తరబడి ఇంటెలిజెన్స్‌లో పాతుకు పోయినట్లు తెలుస్తోంది. కొందరైతే ఎస్పీ,డీఎస్పీ స్థాయిలో పదవీ విరమణ చేసినా..ఓఎస్డీలుగా కొనసాగారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు శివారు కమిషనరేట్‌నూ తాకిన సంగతి తెలిసిందే.ఇప్పటికే హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్ రావు పేరు వెలుగులోకి రాగా.. తాజాగా శివారు కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ మాదిరి విభాగానికి(ఎస్‌వోటీ) ఇన్‌చార్జిగా వ్యవహరించిన డీసీపీ పాత్రను దర్యాప్తు అధికారులు గుర్తించారు. నాన్-క్యాడర్ అధికారే అయినా.. ఆయన ఆ కమిషనరేట్‌లో రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత కీలకమైన దాదాపు అన్ని జోన్లకు డీసీపీగా పనిచేసినట్లు సమాచారం. సదరు అధికారి తన టీమ్‌తో కలిసి రూ.కోట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు పంజాగుట్ట పోలీసులు అనుమానిస్తున్నారు. స్పెషల్ ఇం టెలిజెన్స్ బ్యూరో కార్యాలయం కేంద్రంగా సాగిన అక్ర మఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. దీనికి ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ (ఐటీఏ)ను కూడా జత చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైనప్పుడు, ప్రణీత్ రావు, భుజం గరావు, తిరుపతన్నల అరెస్టు సమయంలో ఈ చట్టంలోని సెక్షన్ల మేరకు ఆరోపణలు లేవు. తాజాగా ఈ చట్టాన్ని జోడించిన అధికారులు ఈ మేరకు నాంపల్లి కోర్టుకు మెమో ద్వారా సమాచారమిచ్చారు. మరోపక్క ఈ కేసులో నిందితులపై నేరం నిరూపించ డానికి అవసరమైన చర్యలను సిట్ అధికారులు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఎస్ఐబీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసిన టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌ను సాక్షిగా చేర్చారు. ట్యాపింగ్‌పై ఎస్ఐబీ అదనపు ఎస్పీ డి.రమేష్ ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ప్రణీత్ రావు, ఇతరులపై ఈ నెల 10న కేసు నమోదైంది. దీనికి సంబంధించిన ప్రాథమిక సమాచార నివేదికలో పోలీసులు మూడు చట్టాల్లోని తొమ్మిది సెక్షన్ల కింద ఆరోపణలు చేశారు. ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల్లోని సెక్షన్లు చేర్చారు. కాగా ఈ నెల 13న ప్రణీత్ అరెస్టు తర్వాత కోర్టులో రిమాండ్ కేసు డైరీని సమర్పించిన అధికారులు.. ఇందులో ఓ సెక్షన్ తగ్గించి ఎనిమిదింటి కిందే ఆరోపణలు చేశారు. ఎస్ఐబీని చాలాకాలం పాటు పదవీ విరమణ పొంది ఓఎస్డీలుగా పనిచేస్తున్న వాళ్లే నడిపినట్లు తెలిసింది. ఇలాంటి దాదాపు 15 మంది అధికారులను ఆధారంగా చేసుకుని కథ నడిపినట్లు సమాచారం. ఓ మాజీ డీఐజీ, ముగ్గురు మాజీ ఎస్పీలు, ఐదుగురు అదనపు ఎస్పీలు ఇందులో కీలకంగా పనిచేశారని తెలుస్తోంది. అయితే ప్రభుత్వం మారిన తరవాత ప్రభాకర్‌రావుతో పాటే వీళ్లు కూడా రాజీనామా చేసి వెళ్లిపోయారు. సాధారణంగా ఎస్ఐబీ లాంటి సున్నిత విభాగాల్లో మాజీ అధికారులను, ప్రైవేట్ వ్యక్తులను కీలక స్థానాల్లో ఉంచరని, అయితే ప్రభాకర్‌రావు స్వయంగా ఓఎస్డీ కావడంతో ఎస్ఐబీలో ఓఎస్డీలతో పాటు ప్రైవేట్ వ్యక్తుల రాజ్యం నడిచిందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. మరోపక్క ప్రణీత్‌రావుకు ట్యాపింగ్ వ్యవహారంలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు సహకరించినట్లు సిట్ తేల్చింది.

## ఏసుక్రీస్తు త్యాగానికి నిదర్శనం గుడ్‌ఫ్రైడే

### క్రైస్తవులకు తెలుగు రాష్ట్రాల సిఎంల శుభాకాంక్షలు



హైదరాబాద్, మార్చి 28 (ప్రజామంటలు):

గుడ్‌ఫ్రైడే సందర్భంగా తెలుగు రాష్ట్రాల సిఎంలు జగన్, రేవంత్ రెడ్డిలు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ, ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి యేసు క్రీస్తు త్యాగాన్ని ధైర్యాన్ని గుర్తు చేసుకున్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆయన క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియచేశారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ, ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన అన్నారు. క్రీస్తు త్యాగాల జ్ఞాపకంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర సోదరీమణులందరూ ఘనంగా జరుపుకోవాలని సిఎం రేవంత్ సూచించారు. మానవాళి కోసం కరుణామయుని మహాత్యాగమే గుడ్ ఫ్రైడే.. జీసస్ జీవితమే మానవాళికి గొప్ప సందేశం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 'ఏసు ప్రభువును శిలువ వేసిన గుడ్ ప్రైడే రోజు. ఆ తరువాత ఆయన పునరుజ్జీవించిన ఈస్టర్ సండే రోజు.. ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపులు తిప్పిన ఘట్టాలు అని సీఎం పేర్కొన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశ మంతటి సహనం, అవధులు లేని త్యాగం.. ఇవన్నీ తన జీవితం, బోధనలు ద్వారా జీసస్ లోకానికి ఇచ్చిన సందేశాలు అని సీఎం జగన్ అన్నారు.

## భారత సరిహద్దులు పూర్తి సురక్షితం

### - యువతరం కోసమే అగ్నివీర్.. - రాజ్‌నాథ్ సింగ్



ఢిల్లీ మార్చి 28 (ప్రజామంటలు):

దేశ సరిహద్దులు పూర్తి సురక్షితమని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. సాయుధ బలగాలపై దేశ ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.ఓ జాతీయ వార్తా ఛానల్ ఏర్పాటుచేసిన సదస్సులో పాల్గొన్న ఆయన.. అగ్నివీర్ (ంణనితిలవవతీ) పథకంపై వస్తోన్న విమర్శలతో పాటు పలు అంశాలపై మాట్లాడారు. ఈసందర్భంగా తన 50 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో పలు విశేషాలను పంచుకున్నారు. భారత్-చైనా సరిహద్దు అంశంలో విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. తాను ఎన్నడూ ఇబ్బందికరంగా భావించలేదన్నారు.'దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, నేను చేయగలిగినదంతా వారికి (విపక్షాలకు) చెబుతాను. కానీ, రక్షణరంగంలో మాత్రం వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన విషయాలు ఎన్నో ఉంటాయి. వాటిని బహిరంగంగా చెప్పలేం. మన సైన్యం, భద్రతా దళాలపై విశ్వాసం ఉండాలి. రక్షణ మంత్రిగా ఐదేళ్లు, అంతకుముందు హోం మంత్రిగా ఉన్నాను. నేను చూసిన, అర్థమైన, అంచనా వేసిన ఆధారంగా.. మన దేశం, దేశ సరిహద్దులు పూర్తిగా సురక్షితమని హామీ ఇవ్వగలను' అని రక్షణమంత్రి రామ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.'సాయుధ బలగాల్లో యువతరం ఉండాలన్న వాదనను ప్రతిఒక్కరూ అంగీకరిస్తారు. మన జవాన్ల సరాసరి వయసు 30-50 ఏళ్లు. 18-20ఏళ్ల వయసులో అగ్నివీరులుగా చేరితే.. వారి పోరాట స్ఫూర్తి కొంచెం ఎక్కువగా ఉంటుంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది సాంకేతిక యుగమని, దేశ యువత కూడా ఈ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. అగ్నివీర్ పథకం ద్వారా అటువంటి వారిని సాయుధ బలగాల్లో తీసుకుంటున్నారని అన్నారు. వారి భవిష్యత్తుపై ఈ పథకం ఎలాంటి ప్రభావం చూపదని, ఇందుకోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందన్నారు.




## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నర సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

## సమ భావన



గాంధీ నగర్ లో రామ్మోహన్ ధనికుల్లో ఒకడు. అతని కొడుకు శ్రీకాంత్. కొడుకుని అల్లారు ముద్దుగా పెంచాడు రామ్మోహన్. శ్రీకాంత్ ఏది అడిగితే అవి కొని పెడుతూ ఉంటాడు తండ్రి... ప్రతీరోజూ శ్రీకాంత్ ధనికులుతో వారి వారి పిల్లలతో తిరగడం, ఆడడం ఇంకా స్కూల్ కి వెళ్లడం ఇది వాడి జీవన విధానం. ఒకరోజు తండ్రి సెల్ఫోన్ (చరవాణి) కొని వాడికి ఇచ్చారు. అప్పటినుండి బడిలోని పేద పిల్లలంతా శ్రీకాంత్ చుట్టూరా తిరుగుతూ ఉంటారు. ఇంతవరకు ధనికులే స్నేహితులు, ఇప్పుడు పేద పిల్లలు కూడా స్నేహితులు అయ్యారు శ్రీకాంత్ కి..

.దనికుడైనా అహంకారము లేని మంచి బాలుడుశ్రీకాంత్.. అప్పుడప్పుడు పేద స్నేహితుల ఇంటికి వెళుతూ ఉండేవాడు శ్రీకాంత్. వారి వారి జీవన విధానం గమనిస్తూ ఉండేవాడు శ్రీకాంత్.పేదస్నేహితులకి తిండి, బట్టలు సరిగా ఉండేవి కావు. వారిని చూసి జాలి పడేవాడు శ్రీకాంత్. ఇలా ఉండగా, తండ్రి రామ్మోహన్ శ్రీకాంత్ కి ప్రతి సంవత్సరం పుట్టినరోజు ఒక పండగల జరుపుతారు. ఈసారి తండ్రితో శ్రీకాంత్ తన పేద స్నేహితులందరినీ పిలుస్తాను అంటాడు. దానికి తండ్రి చాలా ఆనందించి వారందరినీ పిలుస్తారు వారందరి కి భోజనాలు, బట్టలు పెడతాడు శ్రీకాంత్. స్నేహితులంతా చాలా సరదాగా గడుపుతారు అది చూసి శ్రీకాంత్ చాలా ఆనంద పడతాడు. ఆనాటి నుండి అతను మనసులో ప్రతిధనికుడు పేదవారిని ఆదుకుంటే బాగుండును అని ఆలోచిస్తాడు అలా కొంతకాలానికి తన చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్తాడు శ్రీకాంత్ .అతడికి ఉద్యోగం రాలేదు. ధనికుడైన తండ్రి రామ్మోహన్ ఒక పెద్ద పరిశ్రమను స్థాపించి. శ్రీకాంత్ ని మేనేజర్ గా చేస్తాడు. అప్పుడు శ్రీకాంత్ వేలవేల మంది పేదలకు తన ఇండస్ట్రీలో ఉద్యోగాలు ఇచ్చి తన పేద స్నేహితులందరికీ అండగా నిలుస్తాడు. శ్రీకాంత్ ఇలాంటి పరిశ్రమలు ఎన్నో పెట్టి పేదవారికి అండదండగా ఉండి తండ్రి చేత శభాష్ అనిపించుకుంటాడు.

ధనికులు చదువుతోపాటు సమాజంలో సమ భావనతో మంచి మనసుతో పేదవారిని ఇలా ఉద్ధరించవచ్చు..

**బళ్ల కృష్ణ వేణి**
**పలాస, 91 93989 05803**

# కెసిఆర్‌ను వెన్నాడుతున్న కేసులు

### రాజకీయంగా కోలుకోలేని స్థితిలో పార్టీ - పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తేనే మనుగడ



హైదరాబాద్, మార్చి 28 (ప్రజామంటలు):

అధికారం కోల్పోవడంతో కెసిఆర్ వెంట నడిచిన వారు ఒక్కొక్కరే వీడిపోతున్నారు. కెసిఆర్‌తో ఇంతకాలం ఉన్న బంధాన్ని వారు కేవలం అధికారంతో మాత్రమే ముడి పెట్టుకున్నట్లు తెలుస్తోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కసీటు అయినా గెల్చుకుంటేనే బిఆర్ఎస్‌కు ప్రాణం ఉంటుంది. ఈ క్రమంలో తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఆయనకు అన్ని దారులు మూసుకుపోయాయన్న ప్రచారం సాగుతోంది. దీనికితోడు అవినీతి, అక్రమాల కేసుల, ఫోన్ ట్యాపింగ్ కేసుల ఉచ్చు తగులుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే పార్లమెంటులో విజయంతో మళ్లీ సర్దుకునే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కూడా ఇప్పుడు అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన స్వీప్ చేయకున్నా నాలుగైదు సీట్లు తెచ్చుకుని గట్టి ప్రభావం చూపించగలగితే రాజకీయంగా నిలబడతారు. లేకుంటే రాజకీయ సునామిలో కొట్టుకుపోతారు. సెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్నది. పదేండ్లు రాష్ట్రాన్నిఏకచత్రాధిపత్యంతో పాలించిన కేసీఆర్ తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకోకముందే లోక్‌సభ ఎన్నికలు పార్టీ మనుగడకే సవాల్ విసురుతున్న పరిస్థితి కనిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో గణనీయ ఫలితాలు సాధించని పక్షంలో పార్టీ ఉనికి ప్రశ్నార్థకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దశాబ్దంన్నర పాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేయడంలో కేసీఆర్, నాటి టీఆరెస్ పాత్ర తక్కువేమీ కాదు. రాష్ట్రం సిద్ధించిన అనంతరం అప్రతిహతంగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నది. మూడోసారి అనూహ్యంగా పరాజయం పాలయ్యారు. తీవ్రమైన ఓటమి నుంచి ఆ పార్టీ కోలుకోకముందే నాలుగు నెలల స్వల్పకాలంలోనే పార్లమెంట్ ఎన్నికలు ముంచుకురావడం సవాల్‌గా మారింది. కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంలో ఇరుక్కోవడం ఎన్నికల ముందు ఎజెండా కాగా, ఎన్నికల తర్వాత రాద్ధాంతంగా మారింది. తాజాగా కవిత అరెస్టు, జైలు ఆ పార్టీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టాయి. మరో వైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మెడకుచుట్టుకుంటోంది. ఇలాంటి ఇబ్బందికరమైన వాతావరణం నెలకొననగా గోరుచుట్టుపై రోకటిపోటులా పార్టీ నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వలసపోవడం ఇబ్బందిగా మారింది. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలకు పెద్ద సంఖ్యలో సాగుతున్న వలసలు గులాబీ నాయకత్వానికి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడగానే బీఆరెస్ ఎమ్మెల్యేలుగా గెలిచిన మాజీ మంత్రి కడియం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతోందని జోస్యాలు చెప్పడం ప్రారంభించారు. ఇప్పుడు ఆ మాటలే బీఆరెస్‌కు ఇబ్బందిగా మారాయి. నైతికత అంశాన్ని పక్కకుపెడితే తమ ప్రభుత్వ రక్షణకు ఫిరాయింపులను ప్రోత్సహించక తప్పలేదంటూ గేట్లు ఎత్తుతున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. తాజాగా నాగేందర్‌ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం రాజకీయ కలవరానికి దారితీసింది. పలువురు సిట్టింగ్ ఎంపీలు కూడా పార్టీని వీడారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. . మెజార్టీ సిట్టింగ్ ఎంపీలు రెండు పార్టీల్లోకి జంప్ అయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ పోరాటం చేస్తున్నారు. 17 ఎంపీ స్థానాలకుగానూ ముగ్గురు సిట్టింగులకు బీఆరెస్ అధినేత అవకాశం కల్పించారు. ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ స్థానాలు సిట్టింగ్‌లకు ఇచ్చారు. కరీంనగర్ సీటు గత ఎన్నికల్లో పోటీచేసిన బీ వినోద్ కుమార్‌కు అభ్యర్థికి కేటాయించారు. ఇక మిగిలిన 13 స్థానాలు కొత్తవారిని బరిలో దింపారు. ఎంపీ టికెట్ కోసం పార్టీలో కనీస పోటీ లేదని పార్టీ వర్గాల్లోనే చర్చించుకోవడం గమనార్హం. ఓడిపోయే స్థానానికి పోటీ ఎందుకనే అభిప్రాయంతో పలువురు నేతలు ఉన్నారన్న చర్చలూ నడిచాయి. వలసలను నివారించేందుకు బుజ్జగింపులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. చేవెళ్ళ టికెట్ రంజిత్ రెడ్డికి బీఆరెస్ ముందుగా డిక్లేర్ చేసినప్పటికీ ఆ పార్టీని కాదంటూ అధికార కాంగ్రెస్‌లో చేరిపోయి ఆ పార్టీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీ మారుతున్నారని తెలిసి ఆయనను బలవంతంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్ళి బుజ్జగించినా.. ఆ తర్వాత బీజేపీలో చేరిపోయారు. ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మారిపోయారు. తనకు ప్రజాభిమానం ఇంకా మెండుగా ఉందని నిరూపించుకుంటే కొంతకాలం రాజకీయంగా నిలబడతారు. కానీ అక్రమాలు, ఆర్థిక కేసులు మాత్రం వదలవని గుర్తించాలి.

## టిక్కెట్ రాకపోవడంతో ఎంపి మనస్తాపం

### ఆత్మహత్యాయత్నం..చికిత్స పొందుతూ మృతి



కోయంబత్తూర్, మార్చి 28 (ప్రజా మంటలు):

లోక్‌సభ ఎన్నికల ముందు తమిళనాడులో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఈరోడ్ ఎంపీ, ఎండీఎంకే నేత గణెళిశమూర్తి (77) కన్నుమూశారు. ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో ఇటీవల ఆయన ఆత్మహత్యకు యత్నించాడు. కోయంబత్తూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకే కూటమిలో ఎండీఎంకే కు ఈరోడ్ స్థానం దక్కింది. అక్కడి నుంచి గణెళిశమూర్తి ఉదయించే సూర్యుడి (డీఎంకే) గుర్తుపైనే పోటీ చేసి విజయం సాధించారు. అయితే, ప్రస్తుత ఎన్నికల్లో కూటమి సర్దుబాట్లలో భాగంగా ఎండీఎంకేకు తిరుచ్చి కేటాయించగా.. అక్కడి నుంచి దురైవైగోను పార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో గణెళిశమూర్తి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలోనే మార్చి 24న ఉన్నట్టుండి ఆయన అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రిలో చేర్చారు. విషపూరిత ట్యాబ్లెట్లు మింగి ఎంపీ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆ తర్వాత పార్టీ వర్గాలు వెల్లడించాయి. గత నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన.. ఈ ఉదయం పరిస్థితి విషమించడంతో కన్నుమూసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. 1947 జూన్‌లో జన్మించిన గణెళిశమూర్తి.. 1993లో ఎండీఎంకే ప్రారంభమైనప్పటి నుంచి ఇదే పార్టీలో ఉన్నారు. 1998లో తొలిసారిగా పళని లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి శాసనసభ సభ్యుడిగా వ్యవహరించిన ఆయన.. 2009లో ఈరోడ్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2014లో ఓటమి పాలై, గత ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి దాదాపు 2లక్షల భారీ మెజార్టీతో మరోసారి విజయం సాధించారు. 2016లో పార్టీ కోశాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

# పోతారంలో సాగునీరు అందక ఎండిన వరి పొలాలు

## పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



సారంగాపూర్ మార్చ్ 28 (ప్రజామంటలు): సారంగాపూర్ మండల పోతారంలో సాగు నీరు అందక గాడిపెల్లి వెంకటేష్, బోధాసు నర్సింగం వరి పొలాలను పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....జగిత్యాల నియోజకవర్గం అనేది ఎస్.ఆర్.ఎస్.పి. ప్రాజెక్ట్ కి గుండెకాయ లాంటిది. గతంలో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం కూడా ఇక్కడే ఉండేది. ఆయకట్టు పెరిగిన తర్వాత ఒక 30 ఏండ్ల నుండి జగిత్యాల ప్రజలు నీటి కొరత చూడడం జరిగింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి గారు కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి, ఎస్.ఆర్.ఎస్.పి. నీటిని కరీంనగర్ వరకు ఆపి. కిందికి కాళేశ్వరం నీటిని వదలడం జరిగింది. దానివలన మన ప్రాంతంలో నీటి కొరత లేకుండా పచ్చని పంటలు పండాయి. విస్తీర్ణం పెరిగి 25 వేల ఎకరాల నుండి 63 వేల ఎకరాలకు పెరిగింది అని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందక పోగా, నేడు పెట్టు బడి పెట్టిన పంట కూడా చేతికి రాక రైతులు నష్ట పోయే ప్రమాదం ఉంది. ఎస్.ఆర్.ఎస్.పి. స్టేజ్ 1 లోనే నీటి కొరత ఉంటే మిగతా వాటి పరిస్తితి మనం అర్థం చేసుకోవచ్చు.

**హరీశ్ రావు తప్పుడు మాటలు మాట్లాడారని జీవన్ రెడ్డి విమర్శించడం హాస్యాస్పదం.**

గతం లో కాళేశ్వరం తో ఒక్క ఎకరా పారలేదు అని చెప్పే నాయకులు, నేడు కాళేశ్వరం లేకుండా పంటలు ఎండిపోయే పరిస్తితి వచ్చింది అని అన్నారు. గత వేసవిలో చెరువులు నిండు కుండలా ఉంటే నేడు చెరువులో, బావుల్లో నీరు లేని పరిస్తితి. రైతులు మళ్ళీ ప్రొక్లిన్,క్రేన్ ల సాయంతో పూడిక తీసే రోజులు వచ్చాయి. ప్రభుత్వం కాళేశ్వరం పునరుద్దరణ చేయాలి. మూడు పిల్లర్లు బాగు చేసి,రైతులకు సాగు నీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాలి అని అన్నారు. కొంత మంది సీనియర్ నాయకులు, ముఖ్యమంత్రి ని తప్పు దారి పట్టించి కాళేశ్వరం దండగ అని చెప్పి, రైతులకు నీటి కష్టాలు తెచ్చారని అన్నారు. కౌలు రైతులు సైతం సాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారు అని, కౌలు రైతులకు కూడా రైతు బంధు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చారని ఎంతమందికి ఇచ్చారు ఓట్లకు వచ్చినపుడు ప్రజలకు చెప్పాలి అని డిమాండ్ చేశారు.

**కేసిఆర్ ని విమర్శించడం మాని రైతులకు న్యాయం చేయాలి.**

గత వర్షాకాలం లో 100 ఏండ్లలో కురవని వర్షాలు కురిశాయి అని, ఆ మూడు రోజుల్లో సంవత్సరంలో పడే వర్షం కురిశాయి అని అన్నారు. ఎస్సారెస్పీ లో హక్కుగా రావాల్సిన నీటిని సూర్య పేట కి విడుదల చేశారు. జగిత్యాల నియోజకవర్గానికి, రైతులకు నష్టం కలిగించే పనులు జరుగుతున్నా ఇక్కడి సీనియర్ నాయకులు ఎందుకు స్పందించడం లేదు చెప్పాలి అని, ప్రజలు గమనిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.టి.సి. మనోహర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, వైస్ఎంపీపీ సురేందర్, ఎంపీటీసీ సుధాకర్, మాజీ సర్పంచ్ ఢిల్లీ రామారావు, మాజీ ఎంపీటీసీ లు సాయిలు, నరసింహ రెడ్డి, యూత్ అధ్యక్షులు మధన్, యూత్ నాయకులు మహేష్, శేఖర్, రైతులు లచ్చయ్య, వెంకటి, రాయనర్సు, అఖిల్, మల్లేష్, నర్సింహం, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ



గొల్లపల్లి మార్చ్ 28 (ప్రజామంటలు): గొల్లపల్లి లో అదర్శ పాఠశాల జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఈవ్ టీజింగ్, చైల్డ్ లేబర్,హ్యూమన్ ట్రాఫికింగ్,డ్రగ్స్, వ్యభిచారం,ఇల్లీగల్ బాడీ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్, అండర్ ఏజ్ డ్రైవింగ్, సోషల్ మీడియా వినియోగం,అపరిచితులతో ప్రవర్తన మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జాగ్రత్తలు పాటిస్తూ క్రమశిక్షణతో విజ్ఞానం సంపాదించుకుంటూ ఉన్నత స్థితిలో ఉండాలని విద్యార్థులకు మార్గదర్శనం అందించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.ఐ. బేగ్ షీ టీమ్ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్, వైస్ ప్రిన్సపల్ కె. నగేష్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, జి. సంధ్య, రమ, వి, హరిప్రియ, ఆర్. సంధ్య, అన్నపూర్ణ, అర్చన, రజిత, ప్రియంక విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు..

## నష్టాలలో ఉన్న సొసైటీ లాభాల్లోకి..

**నిధులు దుర్వినియోగం చేసిన ఎవర్నీ వదలం**

**సభ్యులకు మరిన్ని సేవలు అందించేలా చర్యలు**

**సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్**



ఎల్కతుర్తి మార్చి 28 (ప్రజామంటలు): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ది ఎల్కతుర్తి విశాల సహకార సంఘం పాలక కమిటీ ముందుకు పోతున్నదని ఎల్కతుర్తి సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని విశాల సహకార సంఘం ఆవరణంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులను ఉద్దేశించి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తమ పాలకవర్గం ఏర్పడిన నాడు నష్టాల్లో ఉండి కనీసం సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని తము బాధ్యతలు చేపట్టిన అనంతరం సొసైటీ కార్యక్రమాలు పెంచడంతోపాటు సొసైటీ అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టడంతో ఈనాడు నష్టాల నుండి లాభాల్లోకి వచ్చామని తెలిపారు. గత పాలకవర్గం సొసైటీ నిధులను దుర్వినియోగం చేసి సొంత లాభం కోసం సొసైటీని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. అప్పుల నుండి నాలుగు సంవత్సరాలలో కోటి 50 లక్షల రూపాయలు నిలువ ఉండేలా చర్యలు తీసుకున్నామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంఘ సభ్యులు ఎవరైనా మరణిస్తే 60 సంవత్సరాల లోపు వారికి బ్యాంకు లక్ష రూపాయల ఇన్సూరెన్స్ కల్పిస్తుంది కానీ మరణించిన సభ్యుని కుటుంబ సభ్యులకు 5000 ఇచ్చేందుకు అనుమతి కోసం ప్రపోజల్ పంపామని తెలిపారు. సొసైటీ అభివృద్ధి కోసం రైతుల అనుబంధంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందో సభ్యులు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పాలకమండలి ప్రవేశపెట్టిన పలు తీర్మానాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శేషగిరి, డైరెక్టర్లు ముప్పు మహేందర్, సమ్మయ్య, పోశయ్య, శ్రీనివాస్, లోకిని సూరయ్య, రాజిరెడ్డి, కేడీసీసీ ఎల్కతుర్తి బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ స్వార్థ ఆర్థిక ప్రయోజనాల కోసం వ్యవహరించారు

## బిజెపి భరాసకు రక్షణ గోడల తయారైంది

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 28 (ప్రజామంటలు): తెలంగాణ ఆకాంక్ష నెరవేరాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. జగిత్యాలలో వివేక్ కుమారుడు వంశీ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కెసిఆర్ స్వార్థ ఆర్థిక ప్రయోజనాల కోసం వ్యవహరించారని ఇందుకు బిజెపి భరాసకు రక్షణ గోడల తయారైందని జీవన్ రెడ్డి మండిపడ్డారు.ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం వెలికి తీసి పేదల ఖాతాల్లో 15 లక్షలు ఇస్తామని హామీ మరిచి పెట్రో ధరలు, నిత్యవసర ధరలు పెంచిన మోదీ ప్రభుత్వాన్ని గద్దించాల్సిన అవసరం ఉందని జీవన్ రెడ్డి అన్నారు.వివేక్ మాట్లాడుతూ కెసిఆర్ అవినీతిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ పై కేసు పెట్టాలని వివేక్ డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 14 నుంచి 15 సీట్లు గెలుస్తామని జీవన్ రెడ్డి, వివేక్ ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీఎంపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి కి టికట్ దక్కడంతో ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి ఆయనను సత్కరిస్తున్నారు. అంతకుముందు జీవన్ రెడ్డి ధరూర్ క్యాంప్ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఉపసర్పంచ్



వేలేరు మార్చి 28 (ప్రజామంటలు): వేలేరు మండల కేంద్రంలోని వాస్తవ్యులు డబ్బేట రాజమ్మ రాజయ్య ల పుత్రుడు ప్రవీణ్ రమ్య వివాహం కొత్తకొండ లోని బి.ఆర్.ఎల్. గార్డెన్ లో నిర్వహించగా ఈ వేడుకలో ముఖ్యఅతిథి పాల్గొని సద్దాంహుస్సేన్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితో వెన్నం సంతోష్ రెడ్డి కూరపాటి శ్రీనివాస్, గంగుల రణధీర్ రెడ్డి, తూముల వెంకన్న, బంక రాకేష్, సందుల సంపత్, సూంతపు సతీష్ మాజీ వార్డు మెంబర్ సూంతపు కవిత-కుమార్ కనుకరాజు రవి సంపత్, ప్రశాంత్ సలీం మాలిక్, మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

## గ్రామపంచాయతీలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి: జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా



జగిత్యాల జిల్లా ప్రతినిధి మార్చ్ 28 (ప్రజామంటలు): గురువారం మధ్యాహ్నం టౌన్ హల్ జగిత్యాల నందు అందరు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీవో లు, మున్సిపల్ కమీషనర్ లు, మున్సిపాలిటీ హెల్త్ (ఏ ఈ లు,డి ఈ లు, మిషన్ భగీరథ ఈ ఈ , ఏ ఈ , డి ఈ లు ఆర్ డబ్ల్యూ యస్ ఇంట్రా ఈఈ, ఎఈ లు, డిఈ లు హాజరు అయినా సమ్మర్ యాక్షన్ ప్లాన్ మీటింగునకు హాజరు అయి అందరిని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్ గురుంచి దిశా నిర్దేశం చేస్తూ మరియు జిల్లా లోని అన్ని గ్రామ పంచాయతీల నందు,5 మున్సిపాలిటీ ల యందు ఎండాకాలం నందు ఎటువంటి త్రాగు నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఎండాకాలం నందు ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బంది కలగకుండా ప్రతి గ్రామపంచాయతీ నందు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఏవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనాల నందు ప్రతిరోజు రెండుసార్లు గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీళ్లు పోయించాలని, మొక్కలు చనిపోకుండా చూడాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అదేవిధంగా వరి ధాన్యంకొనుగోలు కేంద్రాలు నందు కూడా వచ్చే రైతులకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామపంచాయతీలు నందు, మున్సిపాలిటీ నందు వచ్చే మూడు నాలుగు రోజుల్లో పైప్ లైన్ రిపేర్లు, మోటార్ల రిపేర్లు, గేట్ వాల్ రిపేర్లు, హ్యాండ్ బోర్ రిపేర్లు, హ్యాండ్ బోర్ మెటీరియల్, ఓ యచ్ యస్ ఆర్ ల రిపేర్లు, వాటర్ ట్యాంకుల క్లీనింగు మొదలగు పనులు పూర్తి చేయాలని ప్రతినెల 1,11,21 తేదీల నందు ప్రతి యొక్క ఓ యచ్ యస్ ఆర్ ట్యాంక్ లని తప్పనిసరిగా బ్లీచింగ్ తో క్లీనింగ్ చేయించాలని ఆదేశించారు. అదేవిధంగా ఓ యచ్ యస్ ఆర్ ట్యాంక్ ల యందు ప్రతి రోజు , బ్లీచింగ్ తో క్లోరినేషన్ చేయించాలని, ప్రతి చివరింటికి పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ వాళ్ల సమన్వయంతో పనిచేయాలని జిల్లాలోని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులను మరియు మున్సిపల్ కమిషన్ల ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ టెస్టింగ్ సంబంధించిన క్లోరోస్కోపులను 380 పంచాయతీలకు, ఐదు మున్సిపాలిటీలకు జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) పాల్గొని ప్రతి గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ పంచాయతీ కార్యదర్శులు తో, మండల పంచాయతీ అధికారులతో, ఆర్డబ్ల్యూసీల సమన్వయం చేసుకొని ఇచ్చిన చెక్ లిస్టు ప్రకారం జిల్లాలోని అన్ని అన్ని సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను దగ్గరుండి పూర్తి చేయించాలని ఆదేశించడం జరిగింది.అదేవిధంగా జిల్లాలోని 380 నర్సరీల నందు మొక్కలు పెరుగుదలకు వాచర్ ద్వారా ప్రతిరోజు నీటినందించి మొత్తం 100% మొక్కల్ని సర్వే చేయాలని ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఓ దేవరాజ్, సీఈఓ రఘువరన్, డి ఆర్ డి ఓ సంపత్ రావు, ఈ ఈ ఆర్ డబ్ల్యూ యస్ సతీష్, జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

### జగిత్యాల గుండు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో

### మార్చి 30న విరాట్ ఆంజనేయ స్వామి ప్రతిష్ట



జగిత్యాల మార్చి 28 (ప్రజామంటలు): జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ళ బావి వద్ద గల శ్రీ గుండు ఆంజనేయ స్వామి స్వయంభు ఆలయ ఆవరణలో శ్రీ విరాట్ ఆంజనేయ స్వామి విగ్రహము ప్రతిష్ట 30వ తేదీ శనివారం జరగనుంది. జగిత్యాల మంచినీళ్ళ బావి నివాసి జూపల్లి తిరుపతి విరాట్ ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ట చేస్తానని మొక్కుకున్న తదుపరి ఆయన కోరిక నెరవేరడంతో తిరుపతి సొంతంగా పీఠము నుండి 16 ఫీట్ల విగ్రహాన్ని ప్రతిష్టించాలని అనుకున్నదే తడువుగా పలువురు స్థానిక భక్తులను కలిసి స్థల నిర్ణయం చేసుకొని విగ్రహ దాతగా సొంత ఖర్చులతో ప్రతిష్ట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విగ్రహ ప్రతిష్ట రోజు జరిగే వైదిక క్రతువులకు స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, శ్రేయోభిలాషులకు, భక్తులకు ఆహ్వాన పత్రాలు అందజేసినట్లు తెలిపారు. శనివారం జరిగే ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమం నిర్వహ ణకు గాను చలువ పందిర్లు తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమం అనంతరం భగవత్ ప్రసాదంగా అన్నదాన వితరణ జరుగునని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# ధర్మపురి దేవస్థానంలో రథోత్సవానికి భారీ ఏర్పాట్లు

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**

ధర్మపురి మార్చ్ 28 (ప్రజామంటలు): సుప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ధర్మపురి దేవస్థానంలో నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శుక్ర వారం నిర్వహించ నున్నందున అధిక మవుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం, మున్సిపల్, ఇతర సంబంధిత అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ మహోత్సవ, తెప్పోత్సవ, డోలోత్సవాది కార్యక్రమాలు, ఉత్తర, దక్షిణ దిగ్యాత్రలు విజయవంతంగా పూర్తి చేసుకుని, వేద సదస్యం, భోగమంటపం, సంగీత సభలను ముగించుకున్న శ్రీనృసింహుడు, సకలాభరణ శోభితయై వెలుగొందుచున్న లక్ష్మీదేవితో కూడి, తమ ఏకాంత మందిరాన నిద్రించుచున్న సమయాన, గుర్తు తెలియని వ్యక్తులెవరో దొంగ చాటున ప్రవేశించి మహాలక్ష్మి నగలన్నీ దోచుకుని వెళతారు. తెల్లవారి నిద్రలేచి జరిగిన విషయాన్ని లక్ష్మీదేవి ద్వారా గ్రహించిన నారసింహుడు, కైలాస గిరీశుడైన అభయం కరుడు శంకరుడు, కలియుగ దైవమైన వేంకటేశ్వ రుడు తోడురాగా, రథారూఢులై బయలుదేరి దొంగలను కనుగొని, వారిని బంధించి దిగ్విజయంగా తిరిగి రావడం పురి క్షేత్ర రథోత్సవ ప్రత్యేకత. అనాదిగా ఆచరిస్తున్న సంప్రదాయాచరణలో భాగంగా దేవస్థాన ప్రాంగణాన గల, దివంగత ధర్మపురి దానకర్తులు దివంగతులైన కోరిడె సదాశివ రాంబాయమ్మ దంపతులు ప్రత్యేకించి తయారు చేయించి దేవస్థానానికి బహూకరించిన లక్ష్మీనర సింహ, శ్రీరామలింగేశ్వర, రాష్ట్ర మాజీ మంత్రి కర్నె వెంకట కేశవుల హయంలో దేవస్థానం తయారు చేయించిన వేంకటేశ్వర స్వాముల రథాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు, యాత్రికులు రథోత్సవంలో భాగస్వాములు కానున్నందున సౌకర్యాలు, వసతులు కల్పనపై దృష్టి పెట్టి వివిధ శాఖల పక్షాన ఏర్పా ట్లను చేశారు. జగిత్యాలతోపాటు ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, ఆర్మూర్, కోరుట్ల, మెట్పల్లి, కామారెడ్డి, భైంసా, వరంగల్, కరీంనగర్ డిపోల నుండి ప్రత్యేక జాతర బస్సులను నడుపుతున్నారు.

**మొక్కులు తీర్చుకున్న భక్తులు...**

**దైవ దర్శనాలకు వేచి ఉన్న భక్తజనం**

ధర్మపరి క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా గురు వారం నిర్వహించిన శ్రీవేంకటేశ్వర ఉత్తర, దక్షిణ దిగ్యాత్రల సందర్భంగా వంశపారంపర్య ఆచార ఆచరణ నేపథ్యంలో రాష్ట్రం నలు మూలల నుండే కాక, మహారాష్ట్ర తదితర సుదూర ప్రాంతాల నుండి ఏతెంచిన భక్తజన దేవస్థానంలో మొక్కులు తీర్చుకున్నారు. పిల్లా పాపలతో గోదావరి నదికి మూదా ముళ్ళీ వెత్తిన పెట్టుకు వచ్చిన భక్తులు, మంగళ స్నానాలను ఆచరించి, గోదావరి మాతను అర్పించి, దానధర్మా దులను ఆచరించి, వివిధ ఆలయాలలో దైవ దర్శనాలు చేసుకున్నారు. ప్రధానంగా కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వర మందిరంలో చిరకాల వాంఛలు ఈడేర్చాలని ప్రార్థిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ముడుపులు చెల్లించుకున్నారు.



**సంప్రదాయ రీతిలో వేద సదస్యం:**

దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై రాత్రి సాంప్రదాయ రీతిలో వేద సదస్యం నిర్వహించారు. యోగానంద, ఉగ్ర నరసింహ, వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలలో భాగంగా కల్యాణం, విహారం, ఉత్తర, దక్షిణ దిగ్యాత్ర అనంతరం శేషప్ప కళా వేదికపై ఏటా వేద పండితులచే వేద సదస్సును నిర్వహించడం ఆనవాయితీ. రుక్, యజుర్, సామ, ఆథర్వణ వేదాలచే దైవారాధన చేయడానికి నిర్ణయించిన క్రమంలో క్షేత్ర వేద పండితులు, అర్చకులే కాక, లబ్ధప్రతిష్ఠులైన స్థానిక వేదవిదులు అపురూపంగా, అరుదుగా ఒకే వేదికపై ఆసన్నులై, వేద సదస్సు నిర్వహించారు. అధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.



# మండుతున్న ఎండలు

## వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

**భీమదేవరపల్లి మార్చ్ 28 (ప్రజామంటలు):**
అసలే మండుటెండలు, ఓవైపు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటుతుంటే, త్రాగునీటి కోసం మండలంలోని చాలా గ్రామాలలో నీటి కటకట.. నీటిని ఎండాకాలంలో పొదుపుగా వాడుకోవాల్సింది పోయి లీకేజీల ద్వారా వృధా కావడంతో తాగునీటికి ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ మధ్యనే మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవ సందర్భంగా, నీటి సంరక్షణ ర్యాలీ నిర్వహించిన సందర్భంలో నీటి సంరక్షణ మన అందరి కర్తవ్యంగా భావించాలని, నీటి చుక్కను పొదుపుగా వాడుకొని నీటిని ఆదా చేయాలని ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన ఈ సందర్భంలో నీరు వృధాగా పోవడం బాధాకరం. వివరాల్లోకి వెళితే భీమదేవరపల్లి మండలం కొత్తకొండ సబ్ స్టేషన్ దగ్గర మిషన్ భగీరథ నీరు లీకేజై రోడ్డు గుండా వృధాగా పోతుంది. గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు ఎవరు పట్టించుకోక పోవడంతో నీరు వృధాగా పోవడంతో ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.




## ప్రజలలో మనో ధైర్యాన్ని కల్పించుటకు కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్

### జెండా ఊపి ప్రారంభించిన డి.ఎస్.పి.

ఇబ్రహీంపట్నం మార్చ్ 28 (ప్రజామంటలు): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఓటర్లంతా నిర్భయంగా ఓటేయుటకు ప్రజలలో మనోధైర్యాన్ని కల్పించుటకు కేంద్ర భాలగాలతో గురువారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఫ్లాగ్ మార్చు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డిఎస్పి, సీఐ, మెట్టుపల్లి ఎస్సై ఇబ్రహీంపట్నం ఎస్సై పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వదు వరులను ఆశీర్వధించిన మాజీ సర్పంచ్ విజయపూరి మల్లికార్జున్

వేలేరు మార్చి 28 (ప్రజామంటలు):
వేలేరు మండల కేంద్రంలోని గ్రామంలో ఉన్న 7వ వార్డుకు చెందిన డబ్బేట ప్రవీణ్ వివాహం కొత్తకొండలో నిర్వహించగా ఈ కార్యక్రమనికి మాజీ సర్పంచ్ మల్లికార్జున్ ముఖ్యఅతిధి గా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. వారి వెంట గ్రమశాఖ అధ్యక్షులు బైరి శ్రీనివాస్, కిరణ్,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇస్రో కు ఎంపికై, అర్హులై చరిత్రను సృష్టించిన జగిత్యాల ప్రజ్ఞ గ్లోబల్ విద్యార్థులు

**జగిత్యాల రూరల్ మార్చ్ 28 (ప్రజామంటలు):**



లక్ష్మీపూర్ లోని ప్రజ్ఞ గ్లోబల్ సి బి ఎస్ ఈ స్కూల్ కి చెందిన విద్యార్థులు కాలువ అనన్య పూసరి, మహీత్ ఇస్రో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన - యువిక యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం కి స్పేస్ క్విజ్, సైన్స్ ప్రాజెక్ట్ మరియు సహ పాఠ్య పోటీలలో తమ విశిష్ట ప్రతిభను కనబరిచి ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 350 మంది విద్యార్థులలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలో నుండి ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఎంపిక కాగా ఇందులో ప్రజ్ఞ గ్లోబల్ కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉండడం స్కూలుకు మరియు జగిత్యాల జిల్లాకు గర్వకారణమని కరస్పాండెంట్ జనగామ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలను అభినందిస్తూ ఈ మహత్తరమైన సాఫల్యం మా విద్యార్థులు అంకిత భావం మరియు శ్రేష్టతనం ప్రతిబింబించడమే కాకుండా ఆవిష్కరణ అణు శాస్త్రీయ విచారణ సంస్కృతిని పెంపొందించడంలో ప్రజ్ఞ గ్లోబల్ స్కూల్ యొక్క నిబద్ధతను కూడా నొక్కి చెబుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. అనిల్, అకాడమీ ఇంచార్జ్ జంగిలి రాజశేఖర్, సైన్స్ ఉపాధ్యాయులు సాగర్, సంధ్య ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులకు అభినందనలను తెలియజేశారు.

## జెఎస్ఆర్ చలివేంద్రాలను ప్రారంభించిన బీజేపీ నాయకులు

### మండుటెండల్లో బాటసారుల దాహం తీర్చనున్న జెఎస్ఆర్ చలివేంద్రాలు

**భీమదేవరపల్లి మార్చ్ 28 (ప్రజామంటలు):**




హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్, భీమదేవరపల్లి గ్రామాల్లో వృక్ష ప్రసాద దాత జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి నియోజకవర్గ ముఖ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మండల బిజెపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండు వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహం తీర్చేందుకు గత మూడు సంవత్సరాలుగా జెఎస్ఆర్ చలివేంద్రాలలో ఫ్రిజ్ లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన చల్లటి నీటిని అందిస్తున్నారని, ప్రజలందరూ ఉపయోగించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గండు సారయ్య, ఓబీసీ మోర్చా ఉపధ్యక్షులు ఊసకోయిల కిషన్, శివసాగర్, దొంగల వేణు, పోడేటి బిక్షపతి, అయిత సాయి, బైరీ సదానందం, అలుగు భాస్కర్, త్రిగ్నేష్, రాహుల్, అక్షయ్, శివమని తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పుప్పాల లింబాద్రి

### ప్రధాన కార్యదర్శిగా తునికి వేణుగోపాల్

**మెట్ పల్లి మార్చి 28 (ప్రజామంటలు):**




మెట్ పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గా పుప్పాల లింబాద్రి మరియు ప్రధాన కార్యదర్శిగా తునికి వేణుగోపాల్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు మగ్గిడి వెంకట నర్సయ్య, సోమ భూమేశ్వర్, కోటగిరి వెంకటస్వామి, పసునూరి శ్రీనివాస్, నల్ల రాజేందర్ రెడ్డి లు తెలిపారు. గురువారం నిర్వహించిన ఎన్నికలు మరియు కౌంటింగ్ అనంతరం వారు మాట్లాడుతూ%ొా%. మొత్తం 142 ఓట్లు పోలవ్వగా, ప్రస్తుత అధ్యక్షుడు లింబాద్రి కి 83 ఓట్లు రాగా, ఆకుల సురక్ష కి 57 ఓట్లు, ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన తునికి వేణు గోపాల్ కి 99 ఓట్లు, కటకం వేణు గోపాల్ కి 40 ఓట్లు వచ్చాయన్నారు. కాగా ఉపాధ్యక్షుడు గా ఎల్ముల రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా రాంపల్లి జగన్, కోశాధికారిగా రాజేష్ శెట్టి, క్రీడలు మరియు సాంస్కృతిక కార్యాదర్సులుగా మగ్గిడి హరిభూషన్ మరియు మగ్గిడి నర్సయ్యలు, లైబ్రరీ కార్యదర్శిగా కోట రాజారెడ్డి, లేడీ రిప్రెజెంటివ్ గా కాజీపేట స్రవంతి, సీనియర్ ఈసీ మెంబెర్లుగా ఒజ్జెల శ్రీనివాస్, అలాల సత్యనారాయణ, సురభి అశోక్ లు జూనియర్ ఈసీ మెంబెర్లుగా మన్నె గంగాధర్, వాల్గోట్ మహేష్, కొమిరెడ్డి శేషగిరి లు ఏకగ్రీవంగా ఎన్నికైనా విషయం తెల్సిందే. ఎన్నికైన కార్యవర్గం చేత ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించి, అనంతరం వారికి సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. ఎన్నికల్లో గెలుపొందిన కార్యవర్గం ఏప్రిల్ 1 నుండి సంవత్సరం పాటు విధులు నిర్వహిస్తారని ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు తెలిపారు.

## అధ్యాపకున్నిసన్మానించిన కళాశాల యాజమాన్యం

**రాయికల్ మార్చ్ 28 (ప్రజామంటలు):**



పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో గత 9 సంవత్సరాలుగా భౌతిక శాస్త్ర ఆధ్యాపకునిగా విధులు నిర్వహిస్తు, అంకితభావంతో పనిచేస్తున్న బదినపల్లి వంశీకృష్ణ ఇటీవల ప్రకటించిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో ఉద్యోగం సాధించినందున, సన్మానించి, చిరు జ్ఞాపికను అందజేసిన జ్ఞానోదయ కళాశాల ప్రిన్సిపల్ బండారు సుమన్ రావు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు చిలువేరి సురేష్, తాటికొండ నాగరాజు, పూదూరి గంగ స్వామి, చంద్రగిరి భార్గవ్, బోడ నాగరాజు, కొత్తపెల్లి వినోద్ పాల్గొన్నారు.

## బెల్టు షాపుపై దాడి చేసిన టాస్క్ ఫోర్స్ అధికారులు

**ఎల్కతుర్తి మార్చి 28 (ప్రజామంటలు):**



ఎల్కతుర్తి మండలం ఆరెపల్లి గ్రామంలో అక్రమ బెల్టు షాపుల దందా అనే వార్తకు స్పందించి టాక్స్ ఫోర్స్ అధికారులు దాడి ఎలక్షన్ కోడ్ వచ్చిన కానీ ఎప్పటిలాగే బెల్ట్ షాప్ లో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని తెలిసి బెల్టు షాపుపై దాడి చేసిన టాస్క్ ఫోర్స్ అధికారులు పదివేల ఎనిమిది వందల విలువ చేసే మద్యం సీసాలు సీజ్ చేసి ఎలిగేటి రమేష్ పై కేసు నమోదు చేశారు ఈ ఎలక్షన్లు పూర్తి అయ్యేవరకు మండలంలో అక్రమంగా బెల్టు షాపుల్లో మద్యం అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు

## బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా గోస్కుల శ్రీనివాస్

**హుజురాబాద్ మార్చ్ 28 (ప్రజామంటలు) :**



హుజూరాబాద్ కోర్టు న్యాయవాదుల సంఘం కు గురువారం జరిగిన ఎన్నికలలో అధ్యక్షునిగా గోస్కుల శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా బండి రమేష్,, ప్రధాన కార్యదర్శి గా మట్టెల తిరుపతి, లైబ్రరీ సెక్రటరీ అప్పని రాజు, కోశాధికారి గా ఎం దివ్య, సీనియర్ ఎక్సిక్యూటివ్ మెంబర్ గా పులుగు లింగారెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు కె. భగవాన్ రెడ్డి, సికె జేమ్స్, ఎన్. సత్యనారాయణలు తెలిపారు. మొత్తం 115 మంది ఓటర్లకు గానూ 113 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన గోస్కుల శ్రీనివాస్ కు 71ఓట్లు, యతిపతి అరున్ కుమార్ కు 41 ఓట్లు వచ్చాయి, కాగా ఒక ఓటు చెల్లకుండా పోయింది.. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన బండి రమేష్ కు59 ఓట్లు బోనగిరి కుమారస్వామి కి 52 ఓట్లు రాగా 2 ఓట్లు చెల్లలేదు, ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన మట్టెల తిరుపతి కి 64 ఓట్లు, ఎర్రోళ్ల రమేష్ కు 45 ఓట్లు రాగా 4 ఓట్లు చెల్లకుండా పోయాయి. కోశాధికారి పదవికి పోటీచేసిన ఎం దివ్య కు 66 ఓట్లు రాగా, సిహెచ్ భానుకిరణ్ కు 44 ఓట్లు రాగా 3 ఓట్లు చెల్లకుండా పోయాయి. లైబ్రేరియన్ పదవికి పోటీచేసిన అప్పని రాజు కు 56 ఓట్లు, బత్తుల తిరుపతి కి 54 ఓట్లు రాగా 3 ఓట్లు చెల్లకుండా పోయాయి, సీనియర్ ఎక్సిక్యూటివ్ సభ్యులుగా పోటీ చేసిన పులుగు లింగారెడ్డికి 65 ఓట్లు, అందె వెంకటేశ్వర రావు కు 48 ఓట్లు వచ్చాయి. కాగా సహాయ కార్యదర్శి గా పి.జ్యోత్స్న దేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ గా కల్వల సౌమిత్ర, జూనియర్ ఎక్సిక్యూటివ్ మెంబర్ గా కె. సరిత, మహిళా సభ్యురాలుగా ముశం మౌనిక గతం లోనే ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.



## జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా లక్ష్మారెడ్డి

### అభినందించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**జగిత్యాల మార్చ్ 28 (ప్రజామంటలు):**



జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు గా సీనియర్ న్యాయవాది డబ్బు లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కోర్టులో జరిగిన ఎన్నికలలో రాచకొండ శ్రీరాములు, డబ్బు లక్ష్మారెడ్డిలు పోటీపడగా 2 ఓట్ల తేడాతో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా డబ్బు లక్ష్మారెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి ని ఎమ్మెల్సీతాటిపర్తి జీవన్ రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

**కొడిమ్యాల మార్చ్ 28 (ప్రజామంటలు):**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని సాయి బాబా ఆలయంలో గురువారం అనంతుల కాశిన్ ధీరజ్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా వారి అమ్మ నాన్న సంగీత యామిని-పూర్ణ చందర్ (ట్రాన్స్ కో ఏ ఈ) దాదాపు 400 మందికి అన్నదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు పుట్టిన రోజు సందర్భంగా ఏదో ఒక మంచి కార్యక్రమం చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు గుండేటి రమేష్, ఏనుగు ఆదిరెడ్డి, ఎళ్ళం శ్రీనివాస్, నారకట్ల మహిపాల్, చిట్యాల పెల్లి కల్యాణ్, పూజారి నాగరాజు శ్రీనివాస్, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు రూ. 55,116 విరాళం

కొడిమ్యాల మార్చ్ 28 (ప్రజామంటలు):



కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయమునకు కొడిమ్యాల వాస్తవ్యులు మారు తిరుపతిరెడ్డి- రాజశ్రీ కూతుర్లు: నిత్య రెడ్డి, ఆధ్యరెడ్డి, తల్లిదండ్రులు: రాంరెడ్డి- లక్ష్మి ల కుటుంబం ఆలయానికి రాజ పోషకులుగా 55,116 (యాభై ఏదు వేల నూట పదహారు) రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి ధన రూపేనా సహకరించిన దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి సహకరించిన దాతల కుటుంబానికి నిర్మాణ కమిటీ తరఫున, భక్తుల తరఫున, గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# హంతకులకు ఓటేయొద్దు

**మరోమారు వివేకా తనయ వినతి**

**ఐదేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతన్న పట్టించుకోని జగన్**

**అన్న అంటే చెల్లెలుకు చేసే న్యాయం ఇదేనా : వివేకా కుమార్తె సునీత ప్రశ్న**

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):



హంతకులకు ఓటు వేయవద్దని మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత మరోమారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ హైకోర్టు వద్ద గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీఎం జగన్ ప్రొద్దుటూరు సభలో చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. చిన్నాన్న అంటే అర్థం తెలుసా? నాన్న తర్వాత నాన్న.. అలాంటి వ్యక్తిని చంపితే కుట్రను ఛేదించలేదు. పైగా.. చిన్నాన్న కుమార్తెపైనే నిందలు వేయడం న్యాయమా? మీ చెల్లి కోర్టులు, పోలీసుల చుట్టూ తిరుగుతుంటే అన్నగా మీ బాధ్యత ఏంటి? బంధుత్వాలకు అర్థం తెలుసా? చిన్నాన్నను ఎవరు చంపారో దేవుడికి తెలుసు, జిల్లా ప్రజలకు తెలుసు అంటున్నారు. అవును మీరు నిజమే చెప్పారు. వివేకాను చంపించింది ఎవరో.. దేవుడికి, మీకు, జిల్లా ప్రజలకు తెలుసు. అందుకే నిందితులను అంత బాగా రక్షిస్తున్నారని ఎద్దేవా చేశారు. హంతకుడే చెబుతున్నాడు.. వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డే వివేకాను హత్య చేయించారని. ఒకరు చెప్పింది నమ్ముతున్నారు.. ఇంకొకరు చెప్పింది నమ్మడం లేదు. ఐదేళ్లు మీ ప్రభుత్వం ఉండి కూడా ఏం చేశారు? నిందితులను రక్షించేది మీరు కాదా? గతంలో సీబీఐ విచారణ కోరింది మీరే.. ఆ తర్వాత పిటిషన్ ఉపసంహరించుకున్నదీ మీరే. ఎన్నికలు వస్తున్నాయని ఐదేళ్ల తర్వాత చిన్నాన్న గుర్తొచ్చారా? మీరు చేయాల్సిన పని సరిగా చేయనందుకే బయటకు రావాల్సి వచ్చింది. ఎవరు స్వార్థపరులు? ఎవరు పదవుల కోసం హత్య కేసును వాడుకుంటున్నారు. హంతకులకు ఓటు వేయమని మీరు అడుగుతున్నారు. సినిమాలో రౌడీలు ఉంటారు, విలన్ ఉంటాడు. కేవలం రౌడీలను పట్టుకుంటే సరిపోతుందా? విలన్‌ను కూడా పట్టుకోవాలి కదా. చిన్నాన్న చనిపోయి ఐదేళ్లు అవుతోంది. సానుభూతి పొంది ఎన్నికల్లో ఓట్ల కోసం పాకులాడుతున్నారు. తండ్రిని కోల్పోయి నేను న్యాయం కోసం పోరాడుతున్నా. హంతకులకు ఓటు వేయవద్దని మరోసారి ప్రజలను కోరుతున్నా. పదవుల కోసమని నాపై ఆరోపణలు చేస్తున్నారు. న్యాయం కోసం, ధర్మం కోసం నేను పోరాడుతున్నా. సానుభూతి కోసమే ఎన్నికల వేళ చిన్నాన్నను జగన్ తెరపైకి తెస్తున్నారు. వైకాపా పునాదులు వివేకా రక్తంలో మునిగి ఉన్నాయి' అని సునీత ఆవేదన వ్యక్తం చేశారు.

## భర్తను కట్టేసి చితకబాదిన భార్య : దెబ్బలకు తాళలేక భర్త మృతి

కరీంనగర్,మార్చి 28 (ప్రజా మంటలు):



కరీంనగర్‌లో దారుణం చోటు చేసుకుంది. కట్టుకున్న భర్తను భార్య కట్టేసి కొట్టడంతోమృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో పని చేస్తున్న రోహిణి అనే మహిళ భర్తతో తరచూ గొడవ పడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మరోసారి ఇద్దరి మధ్య గొడవ తలెత్తడంతో రోహిణి భర్తను కట్టేసి తీవ్రంగా హింసించడంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బండి సంజయ్‌పై కేసు నమోదు

హైదరాబాద్, మార్చి 28 (ప్రజా మంటలు):

బీజేపీ నేత, ఎంపీ బండి సంజయ్‌పై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. నాచారం సీఐ నందీ శ్వర్‌రెడ్డివిధి నిర్వహణలో ఉన్న తనపై బండి సంజయ్ దాడి చేశాడని సీఐ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో పాటు మరికొందరిపై కేసు నమోదు అయింది.

# సిద్దిపేటలో బిఆర్ఎస్‌కు షాక్

**కొండపాక ఎంపిపి పీఠం కాంగ్రెస్ కైవసం**

సిద్దిపేట, మార్చి 28 (ప్రజా మంటలు):

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఇలాకాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొండపాక మండలం, ఎంపీపీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ప్రస్తుత ఎంపీపీ ర్యాగల సుగుణ దుర్గయ్యపై అవిశ్వాసం నెగ్గింది. దీంతో కొండపాక మండలానికి చెందిన మంచాల అనసూయ కనకరాములు ఎంపీపీగా ఎన్నిక అయ్యారు. ఆరుగురు బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్, ఒక్క బీజేపీ ఎంపీటీసీ కలసి నూతనంగా ఎంపీపీగా కొండపాకకు చెందిన మంచాల అనసూయ కనకరాములును ఎన్నుకున్నారు.

# అలరించిన ప్రేంకుమార్ మిమిక్రీ

ధర్మపురి మార్చ్ 28 (ప్రజా మంటలు) :



శ్రీలక్ష్మీ నరసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా దేవసా స్థానం లో ని శేషప్ప కళా వేదికపై, స్థానిక నాట్యమండల సౌజన్యంతో నిర్వహించిన రాష్ట్ర మిమిక్రీ పితామహ బిరుదాంకితులైన గుండి ప్రేం కుమార్ మిమిక్రీ కార్యక్రమం ఆబాల గోపాలాన్ని అలరించింది. ఆరు దశాబ్దాల కాలానికి పైగా రాష్ట్రంతో పాటు రా ష్ట్రేతర ప్రాంతాల్లోనూ వేలాది ధ్వన్యను కరణ ప్రదర్శనలు ఇచ్చి, మాజీ ప్రధాని పివి నరసింహారావు, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి లాంటి రాజకీయ నాయకులు, ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి సినీ ప్రముఖులు, సి. నారాయణ రెడ్డి, దాశరథి రంగాచార్య లాంటి సాహితీ వేత్తలతో పాటు పలు రంగాల ప్రముఖుల ప్రశంసలు అందుకున్న, ధర్మపు రి క్షేత్రానికి చెందిన గుండి ప్రేం కుమార్ పుట్టిన గడ్డపై దైవ సన్నిధిలో గంటకు పైగా ఇచ్చిన ప్రదర్శన ఆద్యంతం భక్తుల, యాత్రికుల, కళాకారుల నిర్వాహకులను ఆకట్టుకుంది. ప్రధానంగా వివిధ పక్షుల కూతలు, జంతువుల అరుపు లు, మువ్వల సవ్వడులు, హర్షధ్వనాలు, వివిధ ప్రయాణ సాధనాల ధ్వనులు, సితార్ వాద్యను కరణలు ఆహూతుల హృదయాలలో చెరగని ముద్ర వేశాయి. దేవస్థానం పక్షాన మిమిక్రీ చక్రవర్తి ప్రేం కుమార్ను దేవస్థానం పక్షాన ఘనంగా సత్కరించారు.

# ధర్మపురి ఠాణాలో వేంకటేశ్వరునికి పూజలు

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**

ధర్మపురి మార్చ్ 28 (ప్రజా మంటలు) :





సాక్షాత్తూ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన, కలియుగ దైవమైన ఏడు కొండల ప్రభువు శ్రీవేంకటేశ్వరుడే స్వయంగా పోలీసు ఠాణా వెళ్ళడం అరుదైన, అపురూప సంఘటన కాగా, రాష్ట్రంలో వేరెక్కడాలేని, మరెచ్చటనూ కానరాని విధంగా ధర్మపురి క్షేత్రంలో శ్రీలక్ష్మీనారసింహ, శ్రీవేంకటేశ్వర బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా, దక్షిణ దిగ్యాత్రలో భాగంగా స్థానిక పోలీసు స్టేష నుకు వేంకటపతి వెళ్ళి విశేష పూజలందుకోవడం ధర్మపురి క్షేత్రానికి మాత్రమే పరిమితమైన ప్రత్యేకత. ఈకార్యక్రమంలో భాగంగా గురు వారం సాయంత్రం దేవస్థానంలో దక్షిణ, ఉత్తర దిగ్యాత్ర పూజలు నిర్వహించిన అనంతరం, మున్సిపాలిటీ, కూరగాయల మార్కెట్, ఆర్టీసీ బస్టేషన్, చైతన్య భారతి ప్రధాన రహదారి మీదుగా, బాజాభజంత్రీలు, వేదమంత్రాలతో, భక్తులు తోడురాగా స్వామివారిని సాంప్రదాయ రీతిలో ఊరేగించి దక్షిణ దిగ్యాత్ర నిర్వహించారు. ధర్మపురి సిఐ రాం నరసింహా రెడ్డి, ఎస్ ఐ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు కుటుంబాలు స్టేషన్ ఆవరణ లోనికి స్వామివారిని ఆహ్వానించారు. తమవద్దకు అపురూపంగా ఏతెంచిన స్థానిక ఇష్ట దైవాన్ని భక్తులు, పోలీసుల కుటుంబీకులు సాదరంగా, భక్తి శ్రద్ధలతో స్వాగతించారు. స్టేషన్ ప్రాంగణాన స్వామి ఉత్సవ మూర్తులను ఆసీనులజేసి, ప్రత్యేక పూజలొన రించారు. దేవస్థాన ఆస్థాన వేద పండితులు రమేశ శర్మ, అర్చక పురోహితులు సంతోష్ శర్మ, ప్రవీణ్ శర్మ, అర్చకులు శ్రీనివాసా చార్య, వామనాచార్య మోహన్, తదితరులు పూజాదికాలు గావించారు. వేద పండితులు రమేశ శర్మ, వేదమంత్రాలతో విధివిధాన సాంప్రదాయ పూజాదికాలు గావించారు. ఆ పరిసర ప్రాంత ప్రజలు ఘనంగా పూజించి, వేదమూర్తుల ఆశీస్సుల నందుకున్నారు. పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమాలలో ఈఓ శ్రీనివాస్ దర్శకత్వంలో సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జక్కు రవీందర్,సభ్యులు, దేవస్థానం సిబ్బంది, పోలీసుల కుటుంబాలు, ప్రత్యేక విధినిర్వహణలోగల ఉద్యోగులు పాల్గొన్నారు.

**వేంకటేశ్వరుని ఉత్తర దిగ్యాత్ర**

బ్రహ్మోత్సవాల సందర్భంగా శని వారం సాయంత్రం దక్షిణ దిగ్యాత్ర అనంతరం శ్రీవేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను వేద మంత్రాల మధ్య మంగళవాద్యాలు తోడురాగా, పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించి, ఉత్తర దిగ్యాత్రలో భాగంగా, క్షేత్ర శివారులోగల ఉసిరి కచెట్ల వాగు వద్ద, సనాతన పద్ధతి ప్రకారం స్వాములను ఆసీనుల గావించారు. దేవస్థాన ఆస్థాన వేదపండితులు రమేశ శర్మ, అర్చక పౌరో హితులు సంతోష్ శర్మ, ప్రవీణ్ శర్మ, అర్చకులు శ్రీనివాసాచార్య, వామన్, కిరణ్, తదితరులు ప్రత్యేక అర్చనలు గావించారు. మార్గమధ్యలో భక్తులు మంగళ హారతులతో స్వాములకు స్వాగతం పలికారు. తమవ ద్దకు అపురూపంగా ఏడాదికోసారి ఏతెంచే తమ ఇష్ట దైవాన్ని కొలిచేందుకు పరిసర ప్రాంత ప్రజలు పూజా కార్యక్రమాలలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముగింపుగా ఇసుకస్థంభం మండ పంలో స్వాములను ఆసీనుల గావించి, వేదపఠనం, ఆశీర్వచనాది కార్యక్రమాలను సనాతన పద్ధతిలో నిర్వహించారు. దేవస్థానం అర్చకులు, సిబ్బంది. కార్యక్రమాలను పర్యవేక్షించగా భక్తులు అధిక సంఖ్యలో భాగస్వాములైనారు.

CINEMA

# సినిమా

# ఇంకొన్నినెలలు కాస్తా ఓపిక పట్టండి

**రామ్‌చరణ్ గేమ్ ఛేంజర్‌పై దిల్‌రాజు**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజును హైదరాబాద్‌లో ఫ్యాన్స్ గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారు. ఈ వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన ఎందరో సెలబ్రిటీలు హాజరై, రామ్ చరణ్ గొప్పతనాన్ని చెప్పుకొచ్చారు. ఈ వేడుకకు ప్రస్తుతం రామ్ చరణ్‌తో 'గేమ్ చేంజర్' సినిమా నిర్మిస్తోన్న నిర్మాత దిల్ రాజు కూడా హాజరయ్యారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్ చరణ్ చేస్తున్న చిత్రం కావడంతో.. 'గేమ్ చేంజర్' సినిమాపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని, అందుకే సినిమా ఆలస్యం అవుతుందని దిల్ రాజు ఈ కార్యక్రమంలో వెల్లడించారు. ఇంకా మెగా ఫ్యాన్స్ ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'మీ ఓపికకు పరీక్ష పెడుతున్నాం. ఇంకొంత కాలం ఓపిక పట్టాల్సిందే. ఒక తుపాను వచ్చే ముందు ప్రశాంతమైన వాతావరణం ఎలా ఉంటుందో.. అలా కాస్త సైలెంట్‌గా ఉండక తప్పదు. ఎందుకంటే, రామ్ చరణ్ ఇప్పుడు మెగా పవర్‌స్టార్ కాదు.. గ్లోబల్ స్టార్. 'ఆర్ఆర్ఆర్' తర్వాత చరణ్ నుండి వస్తున్న సినిమా కాబట్టి.. ఆ స్థాయిని మించేలా 'గేమ్ చేంజర్'ని శంకర్ తీర్చిదిద్దుతున్నారు. మరో రెండు నెలల్లో షూటింగ్ అంతా పూర్తవుతుంది. ఆ తర్వాత ఐదు నెలల్లో సినిమాను రిలీజ్‌కు తీసుకొస్తాం. చరణ్ బర్త్‌డే స్పెషల్‌గా 'జరగండి జరగండి' పాటని విడుదల చేశాం. ఈ సాంగ్‌లో చూసింది చాలా తక్కువ. అంతా దాచిపెట్టాం. థియేటర్లలో ఈ పాట చూసి ప్రేక్షకులు తప్పకుండా డ్యాన్స్ చేస్తారు. ఇంకొన్ని నెలలు కాస్త నన్ను తిట్టుకోకుండా ఓపిక పట్టండి. 'దిల్ మామా.. మాకొక అప్‌డేట్ ఇవ్వు' అంటూ మీరు పెట్టే కామెంట్స్ అన్ని చూస్తూనే ఉన్నా. ఇకపై ఈ సినిమాకు సంబంధించి ఎటువంటి అప్‌డేట్ అయినా.. శంకర్ ఇవ్వమంటే ఇస్తా తప్పితే ఎలాంటి లీకులు ఇవ్వలేను' అని దిల్ రాజు చెప్పుకొచ్చారు.

## మనమే చిత్రం ఫస్ట్ సింగిల్ విడుదల

ప్రామిసింగ్ హీరో శర్వానంద్ నటిస్తోన్న 35వ చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత కాగా.. కృతి ప్రసాద్, ఫణి వర్మ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. ఏడిద రాజా ఈ చిత్రానికి అసోసియేట్ నిర్మాత. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ సింగిల్ 'ఇక నా మాటే'ని మేకర్స్ విడుదల చేశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

## నవీన్ పోలిశెట్టికి యాక్సిడెంట్

**బైక్ స్కిడ్ అయి పడిపోయినట్లు సమాచారం**



హీరో నవీన్ పోలిశెట్టికి అమెరికాలో బైక్ యాక్సిడెంట్ అయినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం తన తదుపరి సినిమా నిమిత్తం అమెరికాలో ఉన్న నవీన్ పోలిశెట్టి.. అక్కడ బైక్‌పై వెళుతుండగా.. బైక్ స్కిడ్ అవడంతో పడిపోయాడని, చేతికి బలమైన దెబ్బ తగిలినట్లుగా సమాచారం. ఆయనను రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్స్ సూచించారని తెలుస్తోంది. అయితే ఈ యాక్సిడెంట్ జరిగి రెండు మూడు రోజులు అవుతున్నా.. ఇంత వరకు బయటికి రాలేదు. నవీన్ పోలిశెట్టి తన టీమ్‌కి ఈ విషయం తెలియ జేయడంతో.. అతనికి యాక్సిడెంట్ అయినట్లుగా వార్తలు బయటికి వచ్చాయి. ఈ యాక్సిడెంట్‌కి సంబంధించి నవీన్ పోలిశెట్టి మాత్రం ఎక్కడా స్పందించలేదు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'జాతిరత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమాలతో నవీన్ పోలిశెట్టి హీరోగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు. ఎప్పుడూ నవ్వుతూ ఉంటూ.. తన చుట్టూ ఉన్నవారిని నవ్విస్తూ ఉండటం నవీన్ స్పెషాలిటీ. అందుకే ఆయనకు ప్రత్యేక ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. సినిమాల విషయానికి వస్తే.. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా తర్వాత నవీన్ పోలిశెట్టి రెండు సినిమాలకు సైన్ చేశారు. ఒకటి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో కాగా, రెండోది ÷న్ స్క్రీన్స్ బ్యానర్‌లో ఉండనుంది. ప్రస్తుతం సితార బ్యానర్‌లో చేయాల్సిన సినిమాకు సంబంధించి స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి డైరెక్టర్‌ని ఫైనలైజ్ చేసే పనిలో టీమ్ ఉంది.

## గీత గోవిందం' కాంబోలో ఫ్యామిలీ స్టార్







'ఫ్యామిలీ స్టార్' ట్రైలర్ రిలీజ్ వేడుకలో చిత్ర దర్శకుడు పరశురామ్, నిర్మాత దిల్‌రాజు సందడి చేశారు. నగరంలోని శ్రీరాములు థియేటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ అభిమానులతో కలిసి ట్రైలర్ వీక్షించారు. అనంతరం చిత్రాన్ని ఉద్దేశించి దర్శకుడు పరశురామ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫ్యామిలీ స్టార్' విడుదలయ్యాక.. ఈ చిత్రాన్ని, ఇందులోని నటీనటులను తెలుగు ప్రేక్షకులు కొన్నేళ్లపాటు గుర్తుపెట్టుకుంటారని అన్నారు. అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ.. గీత గోవిందం' కాంబోలో వస్తోన్న చిత్రమిది. ఆ స్థాయిలో వినోదం ఉండనుంది. ÷ట్స్, కామెడీ, భావోద్వేగాలు అన్నీ కలిపిన పక్కా సమ్మర్ ఎంటర్‌టైనర్ ఇది. ఒక కుటుంబాన్ని ఉన్నతస్థాయికి తీసుకువెళ్లే ప్రతీ మనిషి ఫ్యామిలీ స్టారే. ఈ సినిమా చూశాక చాలామంది ఫ్యామిలీస్టార్స్‌లా మారతారు. నన్ను దిల్‌రాజుగా మార్చిన 'దిల్' సినిమా ఏప్రిల్ ఐదో తేదీనే విడుదలైంది. దాదాపు 21 ఏళ్ల తర్వాత అదే డేట్‌లో ఈ సినిమా రానుంది. యూనివర్సల్ కంటెంట్‌తో వస్తోన్న చిత్రమిది. తప్పకుండా అందరూ ఎంటర్‌టైన్ అవుతారని అన్నారు. తిరుపతిలో ట్రైలర్ రిలీజ్ సెలబ్రేషన్స్ చేయనున్నట్లు చెప్పారు.

# నేడు టిల్లు స్క్వేర్ విడుదల

**అనుపమ గ్లామర్ డోస్ పెంచడంతో ఉత్కంఠ**




అందరి చూపులు ఇప్పుడు అనుపమ పరమేశ్వరన్ పైనే వున్నాయి. ఆమె నటించిన 'టిల్లు స్క్వేర్' సినిమా శుక్రవారం విడుదలవుతోంది. ఈమధ్యకాలంలో అనుపమకు పెద్ద బ్రేక్ అయితే ఏమీ రాలేదు, అలాగే పెద్ద సినిమాల ఆఫర్స్ కూడా లేవు. అనుపమ మంచి ప్రతిభ కల నటి, తెలుగులో తన గొంతుకు తనే డబ్బింగ్ చెప్పుకునే నటీమణుల్లో అనుపమ ముందుంటారు. ఈ 'టిల్లు స్క్వేర్' లో సిద్ధు జొన్నలగడ్డ పక్కన కథానాయికగా నటించింది. ఇంతకు ముందు సిద్ధు నటించిన 'డీజే టిల్లు' పెద్ద విజయం సాధించటం, ఆ సినిమాకి ఇది సీక్వెల్ గా రావటం, ఈ సినిమాకి లాభదాయకం అని అంటున్నారు.ఇక ఇంతవరకు అన్ని సినిమాలలో అనుపమ తన నటనతో ఎక్కువమంది ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. సామజిక మాధ్యమాల్లో కూడా ఆమెకి విశేషమైన పేరు వుంది, అందుకే ఆమెకి చాలా ఎక్కువమంది ఫాలోవర్స్ కూడా వున్నారు. ఇన్‌స్టాగ్రామ్ లో ఆమెకి 16 మిలియన్ ఫాలోవర్స్ వున్నారంటే మాటలు కాదు. అనుపమ గ్లామరస్ నటి కూడా, కానీ ఆమె ఎప్పుడూ పరిధి దాటకుండా ఇంతవరకు అన్ని సినిమాలలో కనిపించింది. మరి ఏమైందో ఏమో కానీ, 'టిల్లు స్క్వేర్' లో ఈ గ్లామర్ డోసు అనుపమ కావాలనే ఎక్కువ చేశారు అని అటు సామాజిక మాధ్యమాల్లో, ఇటు పరిశ్రమలో టాక్ నడుస్తోంది. విడుదలైన ఈ సినిమా ప్రచార వీడియోల్లో చూస్తే అందులో అనుపమ ఇంతకు ముందు చేసిన సినిమాలతో పోలిస్తే ఈ సినిమాలో గ్లామర్ డోసు బాగా పెంచినట్టు కనపడుతోంది. అయితే ఆమె అభిమానులు చాలామంది ఆమెని అలా చూసి బాగా హర్ట్ అయ్యారు అని ఆమె సామాజిక మాధ్యమాల్లో వాళ్ళు పెట్టిన కామెంట్స్ చూస్తేనే అర్థం అయిపోతోంది. ఆమె ఎందుకు ఈ సినిమా చేసినట్టు, కేవలం తనకి పెద్ద ప్రాజెక్టులు రావటం లేదని ఈ సినిమా ఒప్పుకున్నారు అనే టాక్ కూడా ఒకటి పరిశ్రమలో నడుస్తోంది.కొన్ని రోజుల క్రితం 'టిల్లు స్క్వేర్' ప్రచారానికి అనుపమ వచ్చినప్పుడు ఆమెకి విశేష స్పందన వచ్చింది. అలాగే ఎక్కువమంది ఆమె ఈ ప్రచార చిత్రాలలో కన్పించిన ఆ ముద్దు సన్నివేశం, గ్లామర్ డోసు పెంచారా లాంటి వీటిపై ప్రశ్నలు అడిగారు. అదే సమావేశంలో ఆమె 'టిల్లు స్క్వేర్' సినిమా ప్రచారాలు ఇక మిస్ అవును, అన్నిటికీ వస్తాను అని చెప్పారు. కానీ ఆసక్తికరం ఏంటంటే నిన్న జరిగిన ఆ సినిమా ప్రీ విడుదల వేడుకకి ఆమె డుమ్మా కొట్టారు. మిస్ అయ్యారు.

## స్పోర్ట్స్







# కావ్యాపాపపై నెటిజన్ల రియాక్షన్స్

## కావ్యది ప్రపంచంలోనే అందమైన ఎక్స్‌ప్రెషన్స్



పీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ రికార్డు స్కోరు సాధించి, సరికొత్త చరిత్ర నెలకొల్పింది. 20 ఓవర్లలో 277 పరుగులతో ఆ జట్టు ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించింది. ఈ సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ జంప్ ఆనందంతో ఎగిరి గంతులేసింది. ఆమె ఆనందానికి అవధుల్లేవు. కావ్య గురించి రజనీకాంత్ గతంలో చేసిన ప్రకటన వైరల్‌గా మారింది. దీంతో రజనీకాంత్ కోరిక నెరవేరినట్లైంది. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ సరిగ్గా ఆడలేదు. 14 మ్యాచుల్లో నాలుగింటిలో మాత్రమే విజయం సాధించింది. మ్యాచ్ ఓడిపోయినప్పుడల్లా కావ్య పాప దిగాలుగా కూర్చునేది. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయాన్ని స్వయంగా రజనీకాంత్ కూడా గమనించారు. కళానిధి మారన్ 'సన్‌రైజర్స్ హైదరాబాద్' జట్టుకు యజమాని. కావ్య మారన్ కళానిధి కూతురు. కళానిధికి సన్ టీవీ, సన్ పిక్చర్స్ కూడా ఉన్నాయి. 'జైలర్' చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించింది. ఈ కార్యక్రమంలో కావ్య గురించి రజనీకాంత్ మాట్లాడారు. ఈ ప్రకటన ఇప్పుడు మళ్లీ వైరల్‌గా మారింది.'సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కళానిధి మారన్ మంచి ఆటగాళ్లను చేర్చుకోవాలి. ఐపీఎల్ సమయంలో కావ్య దిగాలుగా కూర్చోవడం చూసి మేం కూడా బాధపడ్డామని రజనీకాంత్ అన్నారు. దీంతో 2024లో సన్‌రైజర్స్ జట్టు కూడా మంచి ఆటగాళ్లను జట్టులోకి చేర్చుకుంది. దీంతో జట్టు విజయం సాధిస్తుంది. దీంతో కావ్య మారన్ కూడా సంతోషం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఎట్టకేలకు కావ్య మారన్ ముఖంలో చిరునవ్వు వచ్చింది' అంటూ కామెంట్స్ వస్తున్నాయి. %ూ=ు% గెలిచింది, ఆమె చిరునవ్వు చూశాం' అని కొందరు రాసుకొచ్చారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్లు అభిషేక్ శర్మ, క్లాసెన్, ట్రావిస్ హెడ్ సిక్సర్లు కొట్టినప్పుడల్లా కావ్యాపాప సంతోషంతో చేసిన ఎక్స్‌ప్రెషన్స్‌కు నెటిజన్లు ఫిదా అయ్యారు. ఇక రజనీకాంత్ విషయానికి వస్తే.. ఈ ఏడాది ఆయన అతిథి పాత్రలో కనిపించిన 'లాల్ సలామ్' విడుదలైంది. ఈ అంతగా విజయం సాధించలేదు. ప్రస్తుతం 'వెట్టయన్' లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి టీజీ జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నారు.

## జయంతో ఊపుమీద ఉన్న రాయల్స్ కు ఢిల్లీ బ్రేకులు వేసేనా..?!




జైపూర్ లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఐపీఎల్ 2024 తొమ్మిదో మ్యాచ్ లో భాగంగా సంజూ శాంసన్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), ఢిల్లీ క్యాపిటల్స్ (డిసి) రిషబ్ పంత్ తో ఇద్దరు వికెట్ కీపర్ల సమరం జరగబోతుంది. ఇక లక్నో సూపర్ జెయింట్స్ )పై అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో రాయల్స్ ఈ గేమ్ లోకి అడుగుపెట్టనుంది. కెప్టెన్ శాంసన్ అజేయ అర్ధ సెంచరీతో వారి బ్యాటింగ్ తో ఫామ్ లోకి రాగా.. రియాన్ పరాగ్ కూడా మంచి టచ్ లో ఉన్నాడు. 194 పరుగులను డిఫెండింగ్ చేస్తూ, అవేష్ ఖాన్ మినహా రాజస్థాన్ రాయల్స్ ఉపయోగించిన బౌలర్లందరూ కనీసం ఒక వికెట్ తీశారు. అయితే, ఇక కొత్త బంతితో ట్రెంట్ బౌల్ట్ ఎలాగో మంచి శుభారంభాన్ని అందిస్తాడు. ఇక మరోవైపు.. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు పంజాబ్ కింగ్స్ చేతిలో ఓడిపోవడంతో వారి ఈ ఐపీఎల్ సీజన్ గొప్పగా ప్రారంభం కాలేదు. ఢిల్లీ క్యాపిటల్స్ తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత బాటింగ్ కి వచ్చిన పంజాబ్ కింగ్స్ బ్యాటర్స్ ను ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ యూనిట్ పరిమితం చేయలేకపోయింది, దింతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో గేమ్ ను గెలుచుకుంది. ఇక నేడు రెండు టీమ్స్ ఆటగాళ్లు ఈ విధంగా ఉండొచ్చు. రాజస్థాన్ రాయల్స్ చూస్తే.. యశస్వి జైస్వాల్, జోస్ బట్లర్, సంజు శాంసన్ , రియాన్ పరాగ్, షిమ్రాన్ హెట్మెయర్, ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, ట్రెంట్ బౌల్ట్, అవేష్ ఖాన్, యుజ్వేంద్ర చాహల్, సందీప్ శర్మ ఉండగా.., మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు డేవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్, షాయ్ హెూప్, రిషబ్ పంత్ (సి %డ% డబ్ల్యుకె), కుమార్ కుషాగ్రా, అక్షర్ పటేల్, అభిషేక్ పోరెల్, కుల్దీప్ యాదవ్, ఖలీల్ అహ్మద్, అన్రిచ్ నార్ట్జే, ముఖేష్ కుమార్ లు ఉన్నారు.

## జ్యోతిష్కుడు ఇముంబై గెలుస్తుంది అంటూ చెప్పుకొచ్చాడు

బుధవారం మ్యాచ్ మొదలవడానికి ముందు ఒక జ్యోతిష్కుడు చిలక జాతకం చెప్పారు. మొదట జ్యోతిష్కుడు చిలకను ముంబై , హైదరాబాద్ తలపడుతున్నాయి ఏది విన్ అవుతుంది చెప్పు చిలకమ్మా అంటే చిలుక పెట్టెలోనుండి వచ్చి ముంబై పోస్టర్ ఉన్న కార్డు తీసింది. అప్పుడు ఆ జ్యోతిష్కుడు ఇవాళ ముంబై గెలుస్తుంది అంటూ చెప్పుకొచ్చాడు. కానీ ఈ మ్యాచ్ లో హైదరాబాద్ గెలవడంతో ఆ చిలకమ్మా ను సోషల్ మీడియా లో ట్రోల్ చేస్తున్నారు కొంతమంది ఫ్యాన్స్. కాగా ఐపీల్ 2024 ఉప్పల్ వేదికగా బుధవారం జరిగిన ఐపిఎల్ మ్యాచ్ లో భాగంగా ముంబై ఇండియన్స్ వర్సెస్ సన్? రైజర్స్ హైదరాబాద్ తలబడ్డాయి. మొదట టాస్ గెలిచినా ముంబై ఫీల్డింగ్ చేయగా హైదరాబాద్ బాటింగ్ స్టార్ట్ చేసింది. ఇక ఇరు జట్లు ఆకాశమే హద్దుగా సిక్సర్ల వర్షం కురిపించి క్రికెట్ ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా మొదటి బ్యాటింగ్ చేసిన సన్? రైజర్స్ జట్టు ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన దగ్గర నుంచి దూకుడు గా ఆడారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (24 బంతుల్లో 62రన్స్,9ఫోర్లు,3సిక్స్ ) చేయగా, వన్ డౌన్ గా వచ్చిన అభిషేక్ శర్మ కూడా (23బంతుల్లో 63రన్స్,3ఫోర్లు,7సిక్స్) హెడ్ తో కలిసి బౌలర్స్ పైన అటాక్ చేస్తూ సెకండ్ వికెట్ భాగస్వామ్యం 69రన్స్ చేసారు. తరువాత విల్లా ఇద్దరు ఔట్ అయినా తరువాత ఐడెన్ మార్క్రామ్, హెన్రిచ్ క్లాసెన్ ముంబై బౌలర్లు ని ఊచకోత కొసరు. క్లాసెన్ (34 బంతుల్లో 82రన్స్,4ఫోర్లు,7సిక్స్ ) చేయగా మార్క్రామ్ (28 బంతుల్లో 42రన్స్,2ఫోర్లు,1సిక్స్ ) తో హైయెస్ట్ టార్గెట్ ని ముంబై ముందు ఉంచారు. అయితే లక్ష చేదనలో బ్యాటింగ్ వచ్చిన ముంబై బ్యాటర్స్ ఓపెనర్స్ రోహిత్ శర్మ , ఇషాన్ కిషన్ నుంచి మంచి స్టార్ట్ లభించింది. నాలుగో ఓవర్ లో ఇషాన్ అవుట్ అవగా వెంటనే రోహిత్ కూడా వెనుదిరిగాడు. తరువాత వచ్చిన యంగ్ స్టార్స్ నమన్ ధీర్, తిలక్ వర్మ కూడా తామేమి తక్కువ కాదంటూ కౌంటర్ ఎటాక్ చేస్తూ టార్గెట్ చాలా దూరం ఉన్నా కానీ.. తమ సాయశక్తుల ప్రయత్నించారు. ఒకానొక టైం లో ముంబై బేటర్లు హిట్టింగ్ చూసి హైదరాబాద్ ఫాన్స్ లో సందేహం మొదలయింది. కానీ డెత్ ఒవెర్స్ లో హైదరాబాద్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడం తో 31రన్స్ పరుగులు తేడాతో సన్ రైజర్స్ విజయం సాధించారు. ముంబై బేటర్స్ లో తిలక్ వర్మ (34 బంతుల్లో 64రన్స్,2ఫోర్లు,6సిక్స్ ) హైయెస్ట్ స్కోరర్ గా నిలిచాడు.

## బల్కంపేట అమ్మవారిని దర్శించుకున్న నీతా అంబానీ



నీతా అంబానీ .. ఈ పేరు తెలియని వాళ్లు ఉండరు.. సినిమా స్టార్స్ కన్నా ఈ పేరు ఎక్కువగా వినిపిస్తుంది.. ఈమెకు ఫాలోయింగ్ కూడా ఎక్కువే.. సినీ హీరోయిన్లు కూడా ఈమెను ఫాలో అవుతున్నారు అంటే ఆమె క్రేజ్ ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు.. సినీ స్టార్స్ కన్నా ఎక్కువ ఫాలోయింగ్ ఈమెకు ఉంది.. ఏ ఫంక్షన్ కు వెళ్లినా, పార్టీలకు వెళ్ళినా కూడా ఈమె స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుంది..తన ఫ్యాషన్ ఐకాన్ తో ప్రజలను ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తుంది.. ఈవెంట్‌తో సంబంధం లేకుండా, ప్రతిసారి కొత్తగా కనిపిస్తుంది. ఆమె ధరించే దుస్తులు, చెప్పులు, పర్సులు ఇలా అన్నీ సరికొత్తవిగా ఉండటం మాత్రమే కాదు.. చాలా ప్రత్యేకమైనవి. అంతేకాదు నీతా అంబానీ కి క్రికెట్ అంటే చాలా ఇష్టం.. టీమ్ లను కొనుగోలు చేస్తుందన్న విషయం తెలిసిందే.. అందుకే ఎక్కడ క్రికెట్ మ్యాచ్ జరిగిన అక్కడ ఆమె దర్శనం ఇస్తారు.. తాజాగా ఆమె హైదరాబాద్ లో దర్శనం ఇచ్చారు.. హైదరాబాద్ లో ముంబై ఇండియన్స్ మ్యాచ్ జరుగుతున్న సందర్బంగా ఆమె హైదరాబాద్ కు విచ్చేసారు.. హైదరాబాద్ బల్కంపేట అమ్మవారినీ దర్శించుకున్నారు.. బుధవారం రాత్రి నీతా అంబానీ అమ్మవారినీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఈవో కుంట నాగరాజు, చైర్మన్ కొత్తపల్లి సాయి గౌడ్, ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు.. దాదాపు 15 నిముషాల పాటు నీతా అంబానీ ఆలయంలోనే గడిపింది.. అనంతరం ఉప్పల్ స్టేడియంకు వెళ్లింది.. అమ్మవారినీ దర్శించుకున్నపుడు దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి..

## రోహిత్‌తో ఆకాశ్ అంబానీ ప్రత్యేక భేటీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్చరిత్రలో ముంబై ఇండియన్స్ జట్టు చెత్త రికార్డును మూట గట్టుకుంది. ఏకంగా 5 సార్లు ఐపీఎల్ ఛాంపియన్ గా నిలిచిన ముంబైపై సన్ రైజర్స్ హైదరాబాద్ ఏకంగా టోర్నీ చరిత్రలోనే అత్యధిక స్కోరు నమోదు చేసింది. బుధవారం (మార్చి 27) రాత్రి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్లను చితక బాదుతూ హైదరాబాదీ బ్యాటర్లు ఏకంగా 277 పరుగులు చేశారు. అనంతరం బ్యాటర్లు ధాటిగానే ఆడినా లక్ష్యం మరీ ఎక్కువైపోవడంతో ముంబై ఇండియన్స్ జట్టు 31 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమి తర్వాత ముంబై జట్టు యజమాని ఆకాష్ అంబానీ రోహిత్ శర్మను కలిశాడు. వీరి మధ్య సుదీర్ఘ చర్చలు కూడా జరిగాయి. ఇప్పుడు ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఐపీఎల్ ప్రారంభానికి ముందు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్ పాండ్యాకు సారథ్య బాధ్యతలను అప్పగించింది. కానీ పాండ్యా సారథ్యంలోని ముంబై ఇండియన్స్ తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించలేదు. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ జట్టు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు అందించిన అపఖ్యాతిని మూటగట్టుకోవడం ఆ ఫ్రాంచైజీని తీవ్రనిరాశకు గురిచేసింది. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ ఓనర్లు ఆకాష్ అంబానీ, నీతా అంబానీలు రోహిత్ శర్మతో జట్టు పరిస్థితిపై చర్చించినట్లు వస్తున్నాయి. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారడంతో క్రికెట్ అభిమానులు, నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. హార్దిక్ పాండ్యాను కెప్టెన్సీ నుంచి తప్పిస్తారని, మళ్లీ రోహిత్ కే పగ్గాలు కట్టబెడతారంటూ ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 277 పరుగులు చేసింది. హైదరాబాద్ తరపున హెన్రిక్ క్లాసెన్ అజేయంగా 80 పరుగులు చేశాడు. 34 బంతుల్లో 7 సిక్సర్లు, 4 ఫోర్లు బాదాడు. అభిషేక్ శర్మ 63 పరుగులతో, ట్రావిస్ హెడ్ 62 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. బదులుగా భారీ లక్ష్య ఛేదనలో ముంబై 246 పరుగులు మాత్రమే చేసింది. తిలక్ వర్మ ఇన్నింగ్స్ 64 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ముంబై బౌలర్లను పరిశీలిస్తే.. పీయూష్ చావ్లా 2 ఓవర్లలో 34 పరుగులు ఇచ్చి 1 వికెట్ తీశాడు. షమ్స్ ములానీ 2 ఓవర్లలో 33 పరుగులు ఇచ్చాడు. మఫాకా 4 ఓవర్లలో 66 పరుగులు ఇచ్చాడు.

## ముంబైని ముంచేందుకే తెచ్చుకున్నారు

### ముంబై జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై విమర్శలు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో గుజరాత్ టైటాన్స్‌ను విజయవంతంగా నడిపించిన హార్దిక్ పాండ్యా.. ముంబై ఇండియన్స్‌కు కెప్టెన్‌గా శుభారంభం చేయడంలో విఫలమయ్యాడు. తొలి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై ఓడిన ముంబై ఇండియన్స్ ఇప్పుడు ఎస్ఆర్‌హెచ్‌పై కూడా ఓడిపోయింది. దీంతో ముంబై ఇండియన్స్ వరసుగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. హైదరాబాద్ వేదికగా జరిగిన ఐపీఎల్ 2024 8వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ముంబై ఇండియన్స్ జట్టు ఓడిపోయింది. ఈ ఓటమి తర్వాత ముంబై జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై విమర్శలు మొదలయ్యాయి. దీనికి ప్రధాన కారణం ఆయనలోని నాయకత్వ లక్షణాలే. ఎస్ఆర్‌హెచ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్లు ఖరీదైనందున, హార్దిక్ జస్ప్రీత్ బుమ్రాను ఉపయోగించకపోవడం ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ 11 ఓవర్లలో 160ం పరుగులు చేసింది. కానీ, హార్దిక్ పాండ్యా ఎప్పుడూ బుమ్రాను ఉపయోగించుకోలేదు. తొలి పదకొండు ఓవర్లలో కేవలం 1 ఓవర్ మాత్రమే ఇచ్చాడు. దీంతో జట్టులో అత్యుత్తమ బౌలర్‌తో ఎప్పుడు బౌలింగ్ చేయాలో తెలియదా? అంటూ టీమిండియా మాజీ ప్లేయర్ కామెంట్స్ చేస్తున్నారు. ఇది చాలా పేలవమైన నాయకత్వం అని టీమిండియా మాజీ ఆటగాడు యూసుఫ్ పఠాన్ విమర్శించారు. ఇదే విషయమై %శ% చేసిన ఆస్ట్రేలియా లెజెండ్ టామ్ మూడీ, జస్ప్రీత్ బుమ్రా ఎక్కడ ఉన్నారు? మ్యాచ్ మొత్తం చేజారిపోతున్నప్పటికీ అత్యుత్తమ బౌలర్‌కు ఒక్క ఓవర్ మాత్రమే ఇస్తారా. అలాంటి కెప్టెన్సీకి అర్థం ఏంటని ప్రశ్నించారు. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ రోహిత్ శర్మను కెప్టెన్‌గా తొలగించడం చాలా ఆశ్చర్యకరమైన చర్య అని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ అన్నాడు. అది కూడా హార్దిక్ పాండ్యా పేలవ నాయకత్వాన్ని చూశాకా ఇదే అర్థమవుతుంది. ముంబై ఇండియన్స్ బౌలర్లను %ూ=ు% బ్యాట్స్‌మెన్స్ నిరంతరం దెబ్బతీస్తున్నప్పటికీ హార్దిక్ పాండ్యా ఆశ్చర్యకరమైన చర్యలో జస్ప్రీత్ బుమ్రాను దూరంగా ఉంచాడు. ఇది హార్దిక్ పాండ్యా నాయకత్వ లక్షణాలను ఇది హైలైట్ చేసిందని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, హెన్రిక్ క్లాసెన్‌ను కట్టడి చేసేందుకు హార్దిక్ పాండ్యా మొదటి 10 ఓవర్లలో బుమ్రాకు 1 ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు. అయితే, క్లాసెన్ రాకముందే %ూ=ు% బ్యాట్స్‌మెన్ 10 ఓవర్లలో 148 పరుగులు చేసి చరిత్ర సృష్టించారు. అయితే హార్దిక్ పాండ్యా ఒక్కడు చాలు ముంబై ఇండియన్స్‌ను ముంచేందుకు అంటూ అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. ముంబై ఇండియన్స్ జట్టుకు కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన తర్వాత హార్దిక్ పాండ్యా భవితవ్యం చాలా పేలవంగా కనిపిస్తోంది. ఓ వైపు రోహిత్ శర్మ ఫ్యాన్స్ వెక్కిరించడం, మరోవైపు లెక్కలు తారుమారవడం వల్ల పాండ్యా కష్టాల్లో పడ్డాడన్నది వాస్తవం.

# ఉప్పల్ లో నమోదైన సరికొత్త రికార్డులివే..!



బుధవారం రాత్రి జరిగిన ఐపిఎల్ మ్యాచ్ లో భాగంగా సన్? రైజర్స్, ముంబై ఇండియన్స్ తలబడ్డాయి. ఇరు జట్లు ఆకాశమే హద్దుగా సిక్సర్ల వర్షం కురిపించి హైదరాబాద్ ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసారు. ఇరు జట్లు ఆకాశమే హద్దుగా సిక్సర్ల వర్షం కురిపించి క్రికెట్ ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా మొదటి బ్యాటింగ్ చేసిన సన్? రైజర్స్ జట్టు ఆకాశమ హద్దుగా చెలరేగి ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు సాధించిన టీం గా రికార్డ్ సృష్టించింది. అయితే లక్ష చేదనలో బ్యాటింగ్ వచ్చిన ముంబై బ్యాటర్స్ కూడా తామేమి తక్కువ కాదంటూ టార్గెట్ చాలా దూరం ఉన్నా కానీ.. తమ సాయశక్తుల ప్రయత్నించారు. ఇక ఈ హై వోల్టేజ్ మ్యాచ్ లో పలు రికార్డులు నమోదయ్యాయి. వాటికి సంబంధించిన వివరాలు చూస్తే.. ఈ మ్యాచ్ లో మొత్తంగా 523 పరుగులు నమోదయ్యాయి. ఐపీఎల్ లోని ఓ మ్యాచ్ లో అత్యధిక పరుగుల రికార్డు ఇదే. ఇదే మ్యాచ్ లో తొలి 10 ఓవర్లలో సన్‌రైజర్స్ సాధించిన స్కోరు 148 పరుగులు. దీంతో గతంలో 2014లో పంజాబ్, 2021లో ముంబయి చేసిన 131 పరుగుల రికార్డు బ్రేక్ అయింది. అలాగే ఈ మ్యాచ్? లో ముంబయి ఇండియన్స్ ?పై సన్ రైజర్స్ హైదరాబాద్? సాధించిన స్కోరు 277/3. ఈ స్కోర్ ఐపీఎల్ చరిత్రలోనే ఓ జట్టు సాధించిన అత్యధిక స్కోరు. గతంలో 2013 లో పుణె వారియర్స్ పై ఆర్సీబీ సాధించిన 263/5 పరుగుల రికార్డ్ ను బ్రేక్ చేసారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే పురుషుల టీ20ల్లో నేపాల్ (314/3), అఫ్ఘానిస్థాన్ (278/3) టీమ్స్? మాత్రమే సన్‌రైజర్స్ కన్నా ఇప్పుడు ముందున్నాయి. ఇక సన్? రైజర్స్ హెడ్, అభిషేక్ బ్యాటింగ్ ద్వయం ఓ రికార్డ్ సాధించింది. ఐపీఎల్ ?లోని ఒకే మ్యాచులో ఒకే జట్టు నుంచి 20 బంతుల్లోగా హాఫ్? సెంచరీలు బాదిన తొలి ద్వయంగా నిలిచారు.

## యూసఫ్ పఠాన్‌పై కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు..

లోక్ సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలన్నీ దూకుడు పెంచాయి. ఇప్పటికే.. హోరాహోరీ ప్రచారంతో దూసుకెళ్తున్నాయి. కాగా.. పశ్చిమ బెంగాల్‌లోని బహరంపూర్ స్థానం నుంచి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్ సైతం ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ తరుణంలో యూసఫ్ పఠాన్ పై కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. మాజీ క్రికెటర్–రాజకీయవేత్త 2011 క్రికెట్ ప్రపంచ కప్‌లో భారతదేశం గెలిచిన క్షణాల పోస్టర్‌లను ప్రచారం కోసం ఉపయోగించడం ద్వారా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (%వీజజ%)ని ఉల్లంఘిస్తున్నారని, యూసుఫ్ పఠాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రాండ్ ఓల్డ్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి లేఖ రాసింది. "వెస్ట్ బెంగాల్‌లోని బహరంపూర్ నుంచి వచ్చే లోక్‌సభ ఎన్నికలలో అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి యూసుఫ్ పఠాన్, ఈ నియోజకవర్గంలోని వివిధ ప్రదేశాలలో బ్యానర్లు, పోస్టర్లు, ఫోటోలను ఉపయోగిస్తున్నారు. ఇది ఐసిసి క్రికెట్ ప్రపంచ కప్, 2011 విజేత క్షణాలను స్పష్టంగా వర్ణిస్తుంది.. ఇక్కడ భారతరత్న సచిన్ టెండూల్కర్, ఇతరులతో సహా మన దేశంలోని ఉన్నత స్థాయి క్రికెట్ సెలబ్రిటీల ఫోటోలు ఉన్నాయి.. ఐసిసి క్రికెట్ ప్రపంచ కప్ 2011 విజేత క్షణాలు జాతీయ గర్వంతో పాటు ప్రతి భారతీయుడు గౌరవించే సెంటిమెంట్" అని కాంగ్రెస్ పేర్కొంది. 2011 ప్రపంచ కప్ విజయాన్ని "చిన్న వస్తు ప్రయోజనాల కోసం ఎన్నికల ప్రచార సమయంలో ఉపయోగించుకోకూడదు. అంతేకాకుండా, ఇది దేశంలో ఇప్పటికే విధించిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పూర్తిగా ఉల్లంఘించడమేనని మేము భావిస్తున్నాము ఎన్నికల ప్రచారంలో మన జాతీయ నాయకుల ఫోటోలను అనైతికంగా, చట్టవిరుద్ధంగా ఉపయోగించడాన్ని" ఆపాలని ఎన్నికల ప్యానెల్‌ను కోరుతున్నాం అంటూ పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థించింది. అయితే, మాజీ క్రికెటర్, TMC అభ్యర్థి యూసఫ్ పఠాన్ ప్రపంచ కప్ ఫోటోలను ఉపయోగించడాన్ని సమర్థించారు. 'నేను ప్రపంచకప్ గెలిచాను. ఈ ఘనత సాధించిన వారు చాలా తక్కువ. ఇది (ప్రపంచ కప్ ఫోటోల ఉపయోగం) తప్పు అయితే, ఎన్నికల సంఘం చూస్తుంది.. న్యాయ బృందం ఈ విషయాన్ని పరిశీలిస్తుంది, "అని యూసుఫ్ పఠాన్ ను ఉటంకిస్తూ ఓ జాతీయ ఛానెల్ వెల్లడించింది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com